నవతెలంగాణ
నవ్యగ తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
శుక్రవారం | ఫిబ్రవరి 07, 2025 | www.navatelangana.com


రేపు బహిరంగ వేలం పాటలు

నవతెలంగాణ-జైపూర్

వేలాల జాతరకు సంబంధించిన దుకాణ సముదాయాలకు ఈ నెల 8న బహిరంగ వేలం పాటలు నిర్వహించనున్నట్లు గ్రామ పంచాయతీ కార్యదర్శి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 11 గంటలకు గ్రామ పంచాయతీ కార్యాలయంలో వేలం పాటలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మహా శివరాత్రిని పురస్కరించుకుని ఈ నెల 26 నుండి 28 వరకు కొనసాగనున్న జాతర సందర్భంగా దుకాణ సముదాయాలు ఏర్పాటు చేసుకునే వారు వేలం పాటలో పాల్గొనాలని తెలిపారు. గ్రామ పంచాయతీ పరిధిలో కొబ్బరి కాయలు, లడ్డూ ప్రసాదం, వాహనాల పార్కింగ్, బోలు పేలాల విక్రయం కోసం వేలం పాటలు నిర్వహించనున్నట్లు తెలిపారు. వేలం పాటలో పాల్గొనే వారు రూ.10వేల ధరావత్తు సొమ్ము నగదుగా చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

అగ్గు మల్లేష్ మృతి పార్టీకి తీరనిలోటు

నవతెలంగాణ- ఆదిలాబాద్‌టౌన్



సీపీఐ(ఎం) పార్టీ సీనియర్ నాయకుడు, తొలి నుంచి పార్టీ పటిష్టత కోసం కృషి చేసిన అగ్గు మల్లేష్(80) మృతి చెందడం పార్టీకి తీరనిలోటని పార్టీ జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు లంక రాఘవులు, సీనియర్ నాయకుడు బండి దత్తాత్రి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పార్టీ ప్రారంభ రోజుల నుంచి పని చేశారని, సైకిల్‌పై గ్రామాలకు వెళ్లి పార్టీ బలోపేతం కోసం కృషి చేశారని పేర్కొన్నారు. అనారోగ్యంతో ఆయన మృతి చెందడం బాధాకరమని తెలిపారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నట్లు పేర్కొన్నారు.

కొత్త మండలం..తప్పిన దూరభారం..!

- మారుమూల గ్రామాలకు చేరువైన పాలన
- సర్టిఫికెట్లు.. రెవెన్యూ, సంక్షేమ సేవలకు మార్గం
- మూడింటిలో ప్రారంభమైన కార్యకలాపాలు
- కార్యాలయాల నిర్మాణం..సిబ్బంది నియామకం పూర్తిచేయాలి

ఏ చిన్న పని ఉన్నా మండల కేంద్రానికి పరుగు తీయాలి. సర్టిఫికెట్ అవసరమున్నా..రెవెన్యూ, వ్యవసాయ పరమైన సమస్య ఉన్నా అక్కడికే వెళ్లాలి. కానీ ఆ కేంద్రం మాత్రం బహుదూరం.. రోజంతా పని మానుకొని వెళితే కానీ ఆ చిన్న పనికూడా పరిష్కారం కాని పరిస్థితి. ఈ తరుణంలో ప్రభుత్వం కొత్త మండలాలను ఏర్పాటుచేయడం వారికి ఎంతగానో ఉపశమనం కలిగించింది. మండలం ఏర్పాటు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు అనేక ఏండ్లుగా కోరుకున్న కల తాజాగా నెరవేరింది. ఆదిలాబాద్ జిల్లాలో సొనాల, భోరజ్, సాత్నాల మండలాలను ఏర్పాటుచేస్తూ గతంలోనే గెజిట్ విడుదల చేసిన సర్కారు..తాజాగా వాటిని అధికారికంగా ప్రారంభించింది. తహసీల్దార్లు, ఎంపీడీఓల నియామకంతో పాటు కొందరు కింది స్థాయి సిబ్బందిని నియమించింది. కానీ కార్యాలయాల నిర్మాణం.. ఇంటర్నెట్ సౌకర్యం కల్పించాల్సి ఉండగా.. సాత్నాల వంటి చోట్ల సెల్‌ఫోన్ సిగ్నల్ సమస్య నెలకొంది. వీటిని పరిష్కరించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

అనేక ఏండ్లుగా వ్యయప్రయాసల కోర్చి పాత మండల కేంద్రాలకు వెళ్లిన వివిధ గ్రామాల ప్రజలకు ఇక నుంచి ఆ బాధలు తప్పనున్నాయి. ఆదిలాబాద్ జిల్లాలో కొత్తగా మూడు మండలాలను ఏర్పాటుచేయడంతో వాటి పరిధిలోకి వచ్చే గ్రామాల సమస్యలకు పరిష్కారం లభిస్తోంది. ఇన్నాండ్లు మండల కేంద్రాలకు వెళ్లాలంటే పడిన బాధలన్నీ దూరం కానున్నాయి. ఇది వరకు జైనథ్ మండలంలోని ఉన్న గ్రామాల్లో 17 గ్రామ పంచాయతీలను విడదీసి కొత్తగా సాత్నాల మండలాన్ని ఏర్పాటుచేశారు. ఇందులో బేల మండల నుంచి 5గ్రామాలు, జైనథ్ నుంచి 5, ఆదిలాబాద్ రూరల్ నుంచి 2 గ్రామాలను కలిపి 12రెవెన్యూ గ్రామాలతో 17 పంచాయతీలుగా ఆవిర్భవించింది. ఇది వరకు ఈ గ్రామాల ప్రజలు జైనథ్ మండల కేంద్రానికి వెళ్లాలంటే 40కిలోమీటర్లు చుట్టూ తిరిగి వెళ్లేవారు. తాజాగా సాత్నాల కేంద్రంగా మండలం ఏర్పాటుచేయడంతో ఆ బాధలు దూరం కానున్నాయి. మరోపక్క సొనాలను కొత్త మండలంగా ఏర్పాటుచేశారు. బోథ్ మండలం నుంచి 12 రెవెన్యూ గ్రామాలను విడదీసి సొనాలలో కలిపి నూతన మండలంగా ఏర్పాటుచేశారు. ముఖ్యంగా సొనాలను కొత్త మండలంగా ఏర్పాటుచేయాలని మండల జేఏసీ ఏర్పాటుచేసి ఆయా గ్రామాల ప్రజలు 84 రోజుల పాటు ఉద్యమించారు. నిరసన దీక్షలు చేపట్టి వారి ఆకాంక్షను తెలియజేయడంతో ప్రభుత్వం ఈ మండలాన్ని ఏర్పాటుచేస్తూ నిర్ణయం తీసుకుంది. మరోపక్క జైనథ్ మండలంలో భాగంగా ఉన్న భోరజ్ కేంద్రంగా చేస్తూ ప్రభుత్వం నూతన మండలం ఏర్పాటుచేశారు. జైనథ్ మండలం నుంచి 17 గ్రామ పంచాయతీలను ఇందులో కలిపి నూతన మండలంగా ఏర్పాటుచేశారు.

తప్పిన దూరభారం..!

కొత్తగా మూడు మండలాలు ఏర్పాటు కావడంతో ఆయా గ్రామాల ప్రజలకు దూరభారం తప్పింది. దీంతో పాటు వివిధ రకాల సర్టిఫికేట్లు, రెవెన్యూపరమైన సమస్యల పరిష్కారం, వ్యవసాయంతో పాటు వివిధ రకాల పనుల కోసం పాత మండల కేంద్రాలకు వెళ్లాలంటే చాలా ఇబ్బందులు పడేవారు. ప్రస్తుతం సాత్నాల పరిధిలోని గ్రామాల ప్రజలు పాత మండల కేంద్రానికి వెళ్లాలంటే కనీసం 40కిలోమీటర్లు ప్రయాణించాల్సిన పరిస్థితి. ఆ రోజున పనికాకుంటే మరుసటి రోజు కూడా వెళ్లేవారు. వీరు వెళ్లే సమయానికి అధికారులు అందుబాటులో లేకపోయినా ఇబ్బందులు పడేవారు. ఇక సొనాల మండల పరిధిలోకి వచ్చే గ్రామాల ప్రజలది కూడా ఇదే పరిస్థితి ఉండేది. పాత మండల కేంద్రానికి వెళ్లాలంటే సుమారు 25కిలోమీటర్లు వెళ్లాల్సి ఉండేది. ఇక భోరజ్ మండల పరిధిలోకి వచ్చే గ్రామాల ప్రజల పరిస్థితి కూడా ఇలాగే ఉండేది. మహారాష్ట్ర సరిహద్దున ఉన్న గ్రామాల ప్రజలు పాత మండల కేంద్రానికి వెళ్లిరావాలంటే ఆపసోపాలు పడేవారు. తాజాగా ఆ సమస్యలు పరిష్కారం కానున్నాయి.

సమస్యలు పరిష్కరించాలి

ప్రస్తుతం మూడు మండలాల్లోనూ అధికారికంగా కార్యకలాపాలు ప్రారంభమయ్యాయి. కానీ అరకొర సౌకర్యాలు..ఇప్పటికే ఉన్న ఇతరాత్ర పాత భవనాల్లో వీటిని ఏర్పాటుచేశారు. సాత్నాల వంటి చోట్ల కనీసం సెల్‌ఫోన్ సిగ్నల్ కూడా లేని పరిస్థితి ఉంది. మిగితా రెండింటిలో కేవలం తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాలు మాత్రమే ప్రారంభించారు. మిగితా కార్యాలయాలు, అధికారులు, సిబ్బంది నియామకం పూర్తిచేయాల్సి ఉంటుంది. ఇది వరకు ఏర్పాటుచేసిన ఐదు మండలాల్లో ఇప్పటికీ కనీస సౌకర్యాలు కల్పించలేదు. వీటిలోనూ అదే రకమైన పరిస్థితి ఏర్పడుతుందనే ఆందోళన సిబ్బంది, మండల ప్రజల్లో వ్యక్తమవుతోంది. ప్రభుత్వం దృష్టిసారించి సిబ్బంది నియామకం, కార్యాలయాల నిర్మాణం చేపట్టాలని కోరుతున్నారు.

చాలా ఆనందంగా ఉంది : మధుకర్, రైతు, కెనాల్ మేడిగూడ



సాత్నాలను కొత్త మండలంగా ఏర్పాటుచేయడం చాలా ఆనందంగా ఉంది. ఇది వరకు పాత మండల కేంద్రానికి వెళ్లాలంటే చాలా ఇబ్బందులు పడేవాళ్లం. కొన్ని సార్లు కెనాల్ పక్క నుంచి నడుచుకుంటూ వెళ్లేవాళ్లం. వాహనాల్లో వెళ్లాలంటే చుట్టూ తిరిగి వెళ్లాల్సి ఉండేది. ప్రస్తుతం మాకు దగ్గరగానే మండలం ఏర్పాటుకావడంతో వివిధ పనులు సులువుగా అవుతాయనే నమ్మకం ఉంది.

సేవలు సులువుగా లభిస్తాయి : మడావి విశ్వనాథ్, తహసీల్దార్, సాత్నాల



కొత్త మండలం ఏర్పాటుకావడంతో వివిధ గ్రామాల ప్రజలకు దూరభారం తప్పింది. ఏదైనా పని నిమిత్తం ఇక్కడకు వచ్చి పరిష్కరించుకొని తిరిగి వెంటనే వెళ్లేందుకు అవకాశం ఉంటుంది. పరిపాలన పరంగానూ సౌకర్యవంతంగా ఉంటుంది. మెరుగైన సేవలు అందించేందుకు కృషిచేస్తాం.

వర్గీకరణలో నేతకాని కులానికి అన్యాయం



నవతెలంగాణ-నస్పూర్

ఎస్సీ వర్గీకరణలో నేతకాని కులానికి అన్యాయం జరిగిందని నేతకాని మహర్షి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు సునర్కర్ రాంబాబు అన్నారు. గురువారం శ్రీరాంపూర్ నస్పూర్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణలో ఏ,బీ,సీగా ఏర్పాటు చేసిన గ్రూపులలో నేతకాని కులస్తులను సీ గ్రూప్‌లో ఉంచి నేతకాని కులానికి అన్యాయం చేశారని తెలిపారు. గతంలో గ్రూపు-బీలో ఉన్న బేడ, బుడ్గ జంగాలను ప్రస్తుతం వెనుకబడిన కులాల జాబితాలోకి మార్చారన్నారు. దళితుల్లో అధిక జనాభా కలిగి, వెనుకబడి ఉన్న కులాల జాబితాలో ఉన్న నేతకాని వర్గాన్ని అభివృద్ధి చెందిన మాల కులాల జాబితాలో పెట్టడం సమంజసం కాదన్నారు. నేతకాని కులాన్ని రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా ఎదగకుండా మాల కులం కుట్ర దాగుందని స్పష్టం అవుతోందని తెలిపారు. విలేకరుల సమావేశంలో రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు గోలేటి లక్ష్మి, జిల్లా మహిళా అధ్యక్షురాలు కామెర్ అనూష, నేతకాని స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జుమ్మిడి గోపాల్, జిల్లా అధికార ప్రతినిధి కొండగొర్ల శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి బెడ్డల లక్ష్మీరాజం, నస్పూర్ మండల అధ్యక్షుడు దుర్గం శివరాం, యూత్ అధ్యక్షుడు చాపిడి విగ్నేష్, దుర్గం రాజయ్య, జునుగురు లక్ష్మణ్, జాడి శ్రీనివాస్, పేగరా సికిందర్ పాల్గొన్నారు.

డాక్టరేట్ అందుకున్న కెప్టెన్ జగ్రామ్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్న కెప్టెన్ జగ్రామ్ అంతర్వేది డాక్టరేట్ పట్టా అందుకున్నారు. రసాయన శాస్త్రంలో 'స్పెక్ట్రోస్కోపిక్ స్ట్రక్చరల్ ఎలక్ట్రికల్ ట్రాన్స్‌పోర్ట్ ప్రాపర్టీస్ ఆఫ్ బేరియం ఆక్సైడ్ కంటైనింగ్ జింక్ బోరేట్ గ్లాస్ సిస్టం డోపుడు విత్ ఆల్కలీ ఆక్సైడ్స్' అంశంపై ప్రొఫెసర్ టి.గంగాధర్ మార్గదర్శకత్వంలో చేసిన పరిశోధనకు ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ పట్టా అందుకోనున్నారు. ఈ పరిశోధన వల్ల భవిష్యత్తులో పర్యావరణహిత గ్లాస్ పాలిమర్లను రూపొందించే అవకాశం కలుగుతుంది. డాక్టరేట్ పట్టా పొందిన జగ్రామ్ అంతర్వేదిని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జె.సంగీత, అధ్యాపకులు అరుణ్‌కుమార్, శ్రావణి, శ్రీధర, జోత్స్న, మంజుల, సంతోష్ కుమార్, రమాకాంత్‌గౌడ్, చక్రవర్తి, రవికిరణ్, రాజ్‌కుమార్, అష్రఫ్ అలీ, రాజేశ్వర్ ఘనంగా సన్మానించి, అభినందనలు తెలియజేశారు.

మాజీ ఎమ్మెల్యే ఆధ్వర్యంలో డప్పుల పంపిణీ



నవతెలంగాణ-జైపూర్

ఎస్సీ వర్గీకరణలో లక్ష డప్పులు..వేల గొంతులు కార్యక్రమం విజయవంతానికి మందక్రిష్ణ మాదిగ పిలుపులో భాగంగా మాదిగలు వేలాదిగా తరలి వెళ్లాల్సిన అవసరముందని బీఆర్ఎస్ నాయకులు కలెగూర రాజకుమార్ అన్నారు. ఈ నెల 7న హైదరాబాద్‌లో మాదిగ బిడ్డల కళాప్రదర్శన విజయవంతం కోసం మాజీ ఎమ్మెల్యే కాసిపేట లింగన్న ఆధ్వర్యంలో గురువారం భీమారం మండల కేంద్రంలో డప్పులు పంపిణీ చేశారు. దీనికి మాజీ ఎమ్మెల్యే కాసిపేట లింగన్నకు కృతజ్ఞతలు తెలిపారు. జైపూర్ మండలం షెట్‌పల్లి మాజీ సర్పంచ్ మేడి రవిమాదిగ సైతం గ్రామానికి చెందిన మాదిగ సామాజికవర్గ కుటుంబాలకు డప్పులు పంపిణీ చేశారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందక్రిష్ణ మాదిగ ఆధ్వర్యంలో ఈ నెల 7న హైదరాబాద్‌లో నిర్వహించతలపెట్టిన కళాప్రదర్శనకు భారీగా తరలివెళ్లి సభను విజయవంతం చేయాలని కోరారు.

గుండెపోటుతో ప్రయివేట్ ఉపధ్యాయుడి మృతి

నవతెలంగాణ-మంచిర్యాల



షటిల్ ఆడే క్రమంలో గుండెపోటుతో ప్రయివేట్ ఉపాధ్యాయుడు మృతి చెందాడు. మంచిర్యాల పట్టణానికి చెందిన బంధం బాపురెడ్డి(50) ముల్కల్లా ఐజా కళాశాలలో ప్రయివేట్ ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నాడు. గురువారం ఉదయం ఇంటి వద్ద మిత్రులతో కలిసి షటిల్ ఆడే సమయంలో గుండెపోటు రావడంతో అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. స్నేహితులు మంచిర్యాల ప్రభుత్వ హాస్పిటల్‌కు తరలించడంతో పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. అప్పటి వరకు అందరితో కలిసి మెలిసి ఉన్న బాపురెడ్డి ఆకస్మికంగా మృతి చెందడంతో స్నేహితులు దిగ్భ్రాంతికి గురయ్యారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. తన భర్త మృతికి చెన్నూర్‌కు చెందిన సతీష్ కారణమని భార్య సరిత పోలీసులకు ఫిర్యాదు చేసింది. 15 నెలల క్రితం సతీష్ దగ్గర బాపురెడ్డి రూ.20 లక్షలు అప్పుగా తీసుకున్నాడు. కొన్ని రోజులకు మనస్పర్థలతో సతీష్ డబ్బులు తిరిగి ఇవ్వాలని బాపురెడ్డిపై ఒత్తిడి తెచ్చాడు. దీంతో మనోవేదన చెందుతున్నాడని, ఈ క్రమంలోనే గుండెపోటు వచ్చిందని భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ ముత్తే ప్రవీణ్ తెలిపారు.

'వై' జంక్షన్ సమస్య పరిష్కారానికి కలెక్టర్ చర్యలు



నవతెలంగాణ-నిర్మల్‌రూరల్

జాతీయ రహదారి విస్తరణలో భాగంగా సోన్ మండలం కడ్తాల్ గ్రామ ప్రజలు ఇబ్బందుల దృష్ట్యా సమస్య పరిష్కారానికి జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ చర్యలు తీసుకున్నారు. గురువారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సంబంధిత అధికారులు, కడ్తాల్ గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కడ్తాల్ జాతీయ రహదారి 'వై' జంక్షన్ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రహదారిపై తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయని గ్రామస్తులు ఆందోళన చెందుతున్న నేపథ్యంలో వారి సమస్యను పరిష్కరించేందుకు సంబంధిత అధికారులందరితో ఇప్పటికే సమావేశం నిర్వహించామన్నారు. ఆర్డీఓ అధ్యక్షతన కమిటీ ఏర్పాటు చేశామన్నారు. ఈ కమిటీ ఇప్పటికే సమస్యాత్మక ప్రదేశానికి వెళ్లి వాహనాల రాకపోకలకు ఎదురవుతున్న ఇబ్బందులను పరిశీలించిందన్నారు. రహదారి సమస్యను శాశ్వతంగా పరిష్కరించడంతోపాటు శాశ్వత పరిష్కారం పూర్తయ్యేలోపు తాత్కాలికంగా ప్రమాదాలను నివారించేందుకు వెంటనే తగు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రహదారి సమస్య పరిష్కారంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ రూపంలో జాతీయ రహదారి ఇంజనీరింగ్ అధికారులతో వివరాలను తెలుసుకున్నారు. సమస్య శాశ్వత పరిష్కారానికి పూర్తి వివరాలతో ప్రాజెక్టు రిపోర్టును సిద్ధం చేయాలన్నారు. కడ్తాల్ గ్రామం నుంచి నిర్మల్ వైపుకు వాహనాలు మళ్లే దారిలో తాత్కాలిక రహదారి విభాగినులను ఏర్పాటు చేసి, భారీ వాహనాలు మళ్లుతాయో లేదో తెలుసుకునేందుకు పరిశీలనాత్మకంగా అధికారులు, గ్రామస్తుల సమక్షంలో ఆర్టీసీ బస్సులను తిప్పి చూడాలన్నారు. వీలైనంత త్వరగా గ్రామస్తుల సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. సమస్య పరిష్కారానికి గ్రామస్తుల నుంచి సూచనలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ జానకి షర్మిల, అదనపు కలెక్టర్(రెవెన్యూ) కిషోర్ కుమార్, అదనపు ఎస్పీలు రాజేష్ మీనా, ఉపేంద్రారెడ్డి, ఆర్డిఓ రత్నకళ్యాణి, ఆర్అండ్‌బి ఈఈ అశోక్‌కుమార్, జాతీయ రహదారుల అధికారి ప్రసన్న, ఆర్టీవో దుర్గప్రసాద్, సోన్ మండల తహసీల్దార్ మల్లేష్, ఎంపీడీవో సురేష్, కడ్తాల్ గ్రామస్తులు, అధికారులు పాల్గొన్నారు.

నులి పురుగుల నివారణపై అవగాహన



నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

నులి పురుగుల నివారణపై మండల విద్యాధికారులు, ప్రయివేట్ పాఠశాలల యాజమాన్య సంఘాల బాధ్యులు, మదర్సా విద్యా సంస్థల నిర్వాహకులకు గురువారం జిల్లా విద్యా శాఖ కార్యాలయంలో జిల్లా విద్యాధికారి పి.రామారావు ఆధ్వర్యంలో అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ నులి పురుగులు అనేవి పరాన్నజీవులని, వీటి వల్ల విద్యార్థులలో పోషకాహార లోపం కలిగి రక్తహీనత వస్తుందని తెలిపారు. వ్యాధి నిరోధకశక్తి తగ్గి బరువు తగ్గుతారన్నారు. బలహీనంతో ఏకాగ్రత లోపించి విషయ గ్రహణ సామర్థ్యం తగ్గుతుందని తెలిపారు. వీటిని నివారించాలంటే వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత పాటించి మంచినీరు, ఆహారం కలుషితం కాకుండా చూసుకోవాలని పేర్కొన్నారు. ప్రతి అంగన్వాడీ, పాఠశాల, జూనియర్ కాలేజీల విద్యార్థులకు సరిపడా మాత్రలు ఏఎన్ఎం, ఆశా వర్కర్లు అందిస్తారన్నారు. ప్రతి సంవత్సరం 2సార్లు ఫిబ్రవరి, ఆగస్టులో నులి పురుగుల నివారణ కారక్రమాలు నిర్వహిస్తారన్నారు. ప్రతి పాఠశాలలో ఒక ఉపాధ్యాయుడిని ఈ కార్యక్రమానికి నోడల్ అధికారిగా నియమించి విద్యార్థులందరూ మాత్రలు వేసుకునేలా చూసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పేర్కొన్నారు. కార్యకమంలో మాస్ మీడియా అధికారి భారే రవీందర్, పరీక్షల సహాయ కమిషనర్ పద్మ, జిల్లా విద్యాశాఖ సమన్వయకర్తలు రాజేశ్వర్, నర్సయ్య, ప్రవీణ్ కుమార్, మండల విద్యాధికారులు, ప్రవేట్ పాఠశాల యాజమాన్య సంఘ బాధ్యులు, మదర్సా విద్యాసంస్థల నిర్వాహకులు పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాయలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పరీక్షల పట్ల భయం లేకుండా ఒత్తిడికి గురికాకుండా పదవ తరగతి విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాయలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా సూచించారు. గురువారం పట్టణంలోని బీసీ స్టడీ సర్కిల్‌లో సోషల్, బీసీ వెల్ఫేర్ ఆధ్వర్యంలో ప్రీమెట్రిక్ వసతి గృహ పదో తరగతి విద్యార్థులకు ప్రేరణ తరగతులను కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు స్టడీ, పరీక్షకు సంబంధించిన మెటీరియల్‌ను కలెక్టర్ అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు పదో తరగతి చాలా ముఖ్యమన్నారు. పరీక్షల పట్ల భయం లేకుండా నిత్యం కష్టపడి పరీక్షల్లో మంచి మార్కులు సాధించేలా ఉపాధ్యాయులు బోధనలు చేస్తున్నారని తెలిపారు. విద్యార్థులు కూడా వారిలోని భయాన్ని తొలిగించుకోవాలని సూచించారు. గత పరీక్షల్లో వచ్చిన ప్రశ్న పత్రాలను విశ్లేషించుకొని చదవాలన్నారు. ఇష్టంతో కష్టపడి చదివి ఉత్తీర్ణులవ్వాలన్నారు. ఎలాంటి సందేహాలున్నా సబ్జెక్ట్ నిపుణులు నివృత్తి చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ, ఎస్సీ వెల్ఫేర్ అధికారులు రాజలింగు, సునీత, స్టడీ సర్కిల్ డైరెక్టర్ ప్రవీణ్, సబ్జెక్ట్ నిపుణులు కంతేశ్వర్, ప్రవీణ్, రమాకాంత్‌రెడ్డి, విఠల్, సుశీల, మురళీధర్ పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలకు చేరుకోవాలి



నవతెలంగాణ-మంచిర్యాల

విద్యార్థులు పరీక్షల సమయంలో భయాన్ని వీడి ఉన్నత లక్ష్యాలను ఎంచుకుని వాటిని చేరుకునే ప్రయత్నం చేయాలని మోటివేషనల్ లైఫ్ కోచ్ ఆర్ఎల్.రామ్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని రాజీవ్‌నగర్ మోడల్ స్కూల్లో యూఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మిట్టపల్లి తిరుపతి ఆధ్వర్యంలో పది, ఇంటర్ విద్యార్థులకు నిర్వహించిన అవగాహన సదస్సులో మాట్లాడారు. జీవితంలో ఎన్నో ఒడిదొడుకులు వస్తుంటాయని, వాటిని సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ఎల్లప్పుడూ విద్యార్థులు సిద్ధంగా ఉండాలన్నారు. విద్యార్థులు పరీక్షలంటే భయంతో కాకుండా ఇష్టంతో చదువుకున్నప్పుడే ఉన్నత లక్ష్యాలను చేరుకోవచ్చని పేర్కొన్నారు. ఈ రోజుల్లో విద్యార్థులు, యువత సోషల్ మీడియాకు బానిసలుగా మారుతున్నారని, దాని నుండి బయటపడి ముందుకు సాగాలని తెలిపారు. టెక్నాలజీని వాడుకొని ఎదగాలే తప్ప, టెక్నాలజీ మనలను వాడుకునే విధంగా ఉండకూడదని తెలిపారు. విద్యార్థులు తమలోని సృజనాత్మకతను బయటకు తీసి రానున్న పరీక్షలలో జిల్లాను రాష్ట్రంలోనే ముందు వరుసలో ఉంచాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ బుచ్చన్న, విద్యార్థులు పాల్గొన్నారు.

అడవి పందిపై పెద్దపులి దాడి

నవతెలంగాణ - కాసిపేట

మండలంలోని పెద్దనపల్లి, దుబ్బగూడెం, సోమగూడెం పాత బస్తీ, బుగ్గగూడెం, కన్నాల, కొత్త వరిపేట శివార్లలో జనావాసాలకు దగ్గరగా పెద్దపులి వారం రోజులుగా సంచరిస్తూ శివారు గ్రామస్తులను భయపెడుతోంది. కొత్త వరిపేట శివారులో పెద్దపులి అడవి పందిని వేటాడి హతమార్చింది. ఈ ఘటన రెండో సారి. నాలుగు రోజుల క్రితం కన్నాల శివారులో అడవి పందిపై దాడి చేసి చంపగా ఇప్పుడు కొత్త వరిపేట సమీపంలో వేటాడి హతమార్చింది. పెద్దనపల్లి శివారులోని కాసిపేట, బెల్లంపల్లికి వచ్చే దారిలో నూతనంగా సింగరేణి వేస్తున్న రోడ్డు మార్గంలో నూతనంగా నిర్మిస్తున్న బ్రిడ్జి వద్ద పెద్దపులి రోడ్డు దాటి కొత్త వరిపేట శివారు పంట చేనులో అడవి పందిపై దాడి చేసింది. దుబ్బగూడెంకు వచ్చిన పెద్దపులి బుగ్గగూడెం వైపు మళ్లీ తిరిగి వెళ్లే క్రమంలో మధ్యలోని కొత్త వరిపేట శివారులో వేటాడి మాంసాన్ని కొద్దిగా తిని వెళ్లిపోయింది. మరుసటి రోజు మళ్లీ వచ్చే అవకాశం ఉండడంతో అధికారులు గ్రామస్తులను అలర్ట్ చేశారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
2
ఆదిలాబాద్-నిర్మల్
శుక్రవారం | ఫిబ్రవరి 07, 2025 | www.navatelangana.com

సీఎం రేవంత్‌రెడ్డికి చిత్రపటానికి పాలాభిషేకం

నవతెలంగాణ-ఉట్నూర్



ఎస్సీ వర్గీకరణ పెండింగ్‌లో ఉన్న బిల్లును చట్టబద్ధత కల్పించినందుకు గురువారం మండలంలోని దంతన్‌పల్లి గ్రామంలో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహనికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సీఎం రేవంత్ రెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ ఛైర్మెన్, ఖానాపూర్ ఎమ్మెల్యేల చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో లింగంపల్లి చంద్రయ్య, బిరుదుల లాజర్, అరకిల్ల అశోక్, అరకిల్ల పరమేశ్వర్, చెవులమద్ది అమృత్, సంతోష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

పాఠశాలను సందర్శించిన డీఈఓ

నవతెలంగాణ-నిర్మల్‌రూరల్



పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించి, ప్రత్యేక తరగతులు నిర్వహించాలని డీఈఓ పి.రామారావు అన్నారు. గురువారం సోన్ మండలంలోని జాఫ్రాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రార్థన సమయానికి సందర్శించి ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు శాతం పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడారు. అధిక సంఖ్యలో పదో తరగతిలో 10 జీపీఏ సాధించాలని సూచించారు. ఉపాధ్యాయులు విద్యార్థుల సందేహాలను నివృత్తి చేయాలని, స్లిప్ టెస్టులు నిర్వహించాలని సూచించారు.

బీసీలకు 50శాతం రిజర్వేషన్‌లు కల్పించాలి



నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

బీసీలకు 50శాతం రిజర్వేషన్‌లు కల్పించాలని బీసీ హక్కుల సాధన కమిటీ సభ్యులు ఎస్ విలాస్ అన్నారు. గురువారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి, అడిషనల్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. భారత రాజ్యాంగం ప్రజలందరికి జాతి, కుల, వర్గ, లింగ వివక్షత లేకుండా సమానత్వాన్ని సమాన అవకాశాలను కల్పిస్తామని హామీ ఇచ్చిందన్నారు. కేంద్రంలో రాష్ట్రంలో సగానికి పైగా ఉన్న బీసీల జీవన ప్రమాణాలను పెరగకుండా ఎన్నటికీ అభివృద్ధి సాధ్యం కాదని, అందుకని సామాజిక న్యాయం సమగ్రాభివృద్ధి జరగాలంటే అన్ని రంగాలలో సంపద అంతా వికేంద్రీకరణ జరగాలని అన్నారు. ఈ సందర్భంగా దేశ జన గణనలో కుల గణన జరపాలని, ఈ పార్లమెంట్ సమావేశాల్లోనే బీసీలకు 50 శాతం చట్టసభల్లో రిజర్వేషన్ బిల్లు పెట్టి అమలు పరచాలన్నారు. కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని, రెండు లక్షల కోట్లతో బీసీ సంక్షేమ అభివృద్ధి కొరకు బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు భూక్య రమేష్, ఎన్.శ్రీనివాసచారి, బీసీ హక్కుల సంఘం, కాల్వ నర్సయ్య వెంకటస్వామి పాల్గొన్నారు.

ఏఐఎస్ఎఫ్ డైరీని ఆవిష్కరించిన డీఈఓ



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) ఆధ్వర్యంలో నూతన సంవత్సరం 2025 డైరీలను రూపొందించారు. గురువారం డీఈఓ ప్రణీత ఆమె కార్యాలయంలో నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భగా డీఈఓ మాట్లాడుతూ విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని సూచించారు. ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్తు కోసం పాటుపడుతుందని తెలిపారు. దేశంలోనే మొట్ట మొదటి విద్యార్థి సంఘం ఏఐఎస్ఎఫ్ అన్నారు. ప్రభుత్వ విద్య పరిరక్షణకు అన్ని విద్యార్థి సంఘాలు పాటుపడాలని ఆమె కోరారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి గేడం కేశవ్, జిల్లా నాయకులు రమేష్, శైలజ, వైశాలి, పూజ, మౌనిక, శారద, ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.

మంత్రుల చిత్రపటాలకు పాలాభిషేకం



నవతెలంగాణ-ఇచ్చోడ

రానున్న స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లను అమలు చేయబోతున్న సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రుల చిత్రపటాలకు గురువారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయం వద్ద పాలాభిషేకం చేసిన మండల బీసీ నాయకులు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు పొన్నం ప్రభాకర్, టీపీసీసీ ప్రెసిడెంట్ మహేష్ కుమార్‌గౌడ్, ఇన్‌చార్జీ మంత్రి సీతక్క బీసీ కులగనా చేసిన ఘనత విరికే దక్కుతుందన్నారు. కాంగ్రెస్ చిత్త శుద్ధితో సమన్యాయం చేయడానికి నిరంతరం కృషి చేస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండలాధ్యక్షులు కళ్లెం నారాయణరెడ్డి, బీసీ సంఘం నాయకులు చోలే ప్రభాకర్, ఇచ్చోడ టౌన్ ప్రెసిడెంట్ ఠాకూర్ విజయ్ సింగ్, ప్రవీణ్ పటేల్, కదం శివాజీ, లాండ్గే శివాజీ, వినాయక్, హరన్ మారుతీ, ఏఎంసీ వైస్ చైర్మెన్ చౌహాన్ శేషారావు, బోథ్ నియోజవర్గ ఎస్సీ సెల్ చైర్మెన్ కొత్తూరు లక్ష్మణ్, నియోజకవర్గ మైనార్టీ చైర్మెన్ ముస్తఫా, మండల మైనార్టీ చైర్మెన్ షేక్ రషీద్, సీనియర్ నాయకులు అక్కపెల్లి లక్ష్మణ్, షఫీ అహ్మద్, షేక్ సాదిక్, ముషారఫ్ ఖాన్, బాలాజీ, అమీనుద్దీన్ పాల్గొన్నారు.

ధ్వజస్తంభం ఏర్పాటుకు రూ.2.5 లక్షల విరాళం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని అపురూప హరిహర ధర్మ క్షేత్ర ఆలయ ప్రతిష్టాపన సందర్భంగా టీచర్స్ కాలనీకి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు కూడాల రవీందర్ ధ్వజస్తంభం ఏర్పాటుకు ఆయన రూ.2.5లక్షల నగదును విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్షుడు బండి అశోక్‌కు గురువారం ఆలయంలో నగదును అందజేశారు. ఆలయ కమిటీ సభ్యులు కుడాల రవీందర్ దంపతులను సన్మానించారు. కార్యక్రమంలో అర్చకులు దామోదర గురుస్వామి, కమిటీ సభ్యులు వేణుగోపాల్‌రెడ్డి, భక్తులు సూది నరేష్, లింగన్న, ఆశన్న, బారె శ్రీధర్, పోతన్న, ఉశన్న, శివకుమార్ పాల్గొన్నారు.

పీడీఎస్‌యూ రాష్ట్ర కోశాధికారిగా మహేందర్

నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

పీడీఎస్‌యూ రాష్ట్ర కోశాధికారిగా నిర్మల్ జిల్లాకు చెందిన రాష్ట్ర జనరల్ కౌన్సిల్ సభ్యుడు, జిల్లా అధ్యక్షుడు వాగ్మరే మహేందర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఫిబ్రవరి 4, 5 తేదీలలో భద్రాచలంలో నిర్వహించిన రాష్ట్ర జనరల్ కౌన్సిల్ రాష్ట్ర కమిటీ సమావేశంలో ఆయనను ఎన్నుకున్నట్టు పీడీఎస్‌యూ నిర్మల్ జిల్లా ఉపాధ్యక్షులు పవార్ కిరణ్ ఒక ప్రకటనలో తెలిపారు. పీడీఎస్‌యూ రాష్ట్ర కోశాధికారి పదవి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోనే నిర్మల్ జిల్లాకు దక్కడం సంతోషమని పేర్కొన్నారు. రాష్ట్ర కమిటీకి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా తరపున కృతజ్ఞతలు తెలియజేశారు.

వై జంక్షన్ సమస్య పరిష్కారానికి చర్యలు

- కలెక్టర్ అభిలాష అభినవ్



నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

సోన్ మండలం కడ్తాల్ గ్రామ సమీపంలోని జాతీయ రహదారి వై జంక్షన్ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. జాతీయ రహదారి విస్తరణలో భాగంగా సోన్ మండలం కడ్తాల్ గ్రామ ప్రజలు ఇబ్బందులు పడుతున్నందున జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ గురువారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సంబంధిత అధికారులు, కడ్తాల్ గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. రహదారి సమస్య పరిష్కారంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ రూపంలో జాతీయ రహదారి ఇంజనీరింగ్ అధికారులతో వివరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రహదారిపై తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయని గ్రామస్తులు ఆందోళన చెందుతున్న నేపథ్యంలో, వారి సమస్యను పరిష్కరించేందుకు సంబంధిత అధికారులందరితో ఇప్పటికే సమావేశం నిర్వహించినట్లు తెలిపారు. ఆర్డీఓ అధ్యక్షతన కమిటీని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ కమిటీ ఇప్పటికే సమస్యాత్మక ప్రదేశానికి వెళ్లి వాహనాల రాకపోకలకు ఎదురవుతున్న ఇబ్బందులను పరిశీలించిందన్నారు. రహదారి సమస్యను శాశ్వతంగా పరిష్కరించడంతో పాటు, శాశ్వత పరిష్కారం పూర్తయ్యేలోపు తాత్కాలికంగా ప్రమాదాలను నివారించేందుకు వెంటనే తగు చర్యలు తీసుకోవాలన్నారు. సమస్య శాశ్వత పరిష్కారానికి పూర్తి వివరాలతో ప్రాజెక్టు రిపోర్టును సిద్ధం చేయాలన్నారు. కడ్తాల్ గ్రామం నుంచి నిర్మల్ వైపుకు వాహనాలు మళ్లే దారిలో తాత్కాలిక రహదారి విభాగినులను ఏర్పాటు చేసి, భారీ వాహనాలు మళ్ళుతాయో లేదో తెలుసుకునేందుకు పరిశీలనాత్మకంగా అధికారులు, గ్రామస్తుల సమక్షంలో ఆర్టీసీ బస్సులను తిప్పి చూడాలన్నారు. వీలైనంత త్వరగా గ్రామస్తుల సమస్యను పరిష్కరించాలన్నారు. గ్రామస్తుల నుంచి సమస్య పరిష్కారానికి సూచనలను తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ జానకి షర్మిల, అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, అదనపు ఎస్పీలు రాజేష్ మీనా, ఉపేంద్రా రెడ్డి, ఆర్డీఓ రత్నకళ్యాణి, ఆర్ అండ్ బి ఈఈ అశోక్ కుమార్, జాతీయ రహదారుల అధికారి ప్రసన్న, ఆరీలో దుర్గప్రసాద్, సోన్ మండల తహసీల్దార్ మల్లేష్, ఎంపీడీఓ సురేష్, కడ్తాల్ గ్రామస్తులు, అధికారులు పాల్గొన్నారు.

ప్రజావాణిలో ఫిర్యాదుల వెల్లువ

నవతెలంగాణ-ఇంద్రవెల్లి



ప్రభుత్వం ప్రారంభించిన పైలట్ ప్రజావాణిని గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేశారు. ఈ ప్రజావాణికి జిల్లా కలెక్టర్ రాజర్షిషా, ఉట్నూర్ సబ్ కలెక్టర్ యువరాజ్, శిక్షణ కలెక్టర్ అభిగ్యాన్‌తో పాటు ఐటీడీఏ, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు. మండలంలో గతంలో జిల్లా స్థాయిలో సమర్పించిన మొత్తం 257 దరఖాస్తులపై హియరింగ్ నిర్వహించారు. ఈ ప్రజావాణిపై కిసాన్ మిత్ర అనే స్వచ్ఛంద సంస్థ మారుమూల గ్రామాల్లో ప్రచారం నిర్వహించినట్టు అధికారులు తెలిపారు. కాని అనేక గ్రామాల్లో ఈ ప్రజావాణిపై అవగాహన లేక పోవడంతో అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొనలేదు. సమ్మక్క, కేస్లాగూడ, పిట్టబొంగరంకు చెందిన ఆదివాసులు సోయం బొజ్జు, తనకు రుణమాఫీ కాలేదని, పీఎం కిసాన్ పథకం అందలేదని ఫిర్యాదు చేశారు. పిట్ట బొంగరంకు చెందిన వెట్టి ఆనంద్‌రావ్ తాను 157 సర్వే నెంబర్‌లో ఉన్న 5.0 ఎకరాల భూమిని గత 30 ఏండ్లు నుంచి సాగుచేస్తున్నానని, ఇంత వరకు నా పేరు మీద పట్టా కాలేదని, కలెక్టర్ ముందు విన్నవించారు. గతంలో పని చేసిన ఓ వీఆర్వో కుమ్ర హీరామన్ పేరిట పట్టా చేశాడని మొరపెట్టుకున్నాడు. స్పందించిన కలెక్టర్ వారం రోజులలోపు సమస్యను పరిష్కరించాలని రెవిన్యూ అధికారులకు ఆదేశించారు. లేని యెడల ఐటీడీఏ సబ్ కలెక్టర్ ఆధ్వర్యంలో డిస్ప్యూట్ కేసును నమోదు చేయాలని ఆదేశించారు. కేస్లాగూడకు చెందిన హెచ్‌కే గంగారాం తనకు గృహజ్యోతి కింద జీరో బిల్లు రావడం లేదని, రుణమాఫీ కాలేదని ఫిర్యాదు చేశారు.

అనేక మందికి ఒకే కుటుంబంలో రెండు లక్షలకు పైన రుణం ఉన్న వారికి రుణమాఫీ కాలేదని అధికారులు సమాధానమిచ్చారు. దాంతో పాటు అనేక మందికి గ్యాస్ సబ్సిడీ రావడం లేదని ఫిర్యాదులు చేశారు. మండలంలో మొత్తం 257 దరఖాస్తులు రాగా కేవలం 60 దరఖాస్తులు మాత్రమే పరిష్కారమయ్యాయి. మిగతా దరఖాస్తులు ఎప్పుడు పరిష్కారమవుతాయో అధికారులకే తెలువాలని పలువురు చర్చించుకున్నారు. ఈ ప్రజావాణిలో డీఆర్డీఓ రాథోడ్ రాజేశ్వర్, సీఈఓ జితేందర్ రెడ్డి, తహసీల్దార్ ప్రవీణ్, డీఎల్‌పీఓ ఫణీంద్రరావ్, వివిధ శాఖల అధికారులకు పాల్గొన్నారు.

అనుమానితులు కనిపిస్తే పోలీసులకు సమాచారమివ్వాలి

- కార్డెన్ సర్చ్‌లో బైంసా ఏఎస్పీ అవినాష్ కుమార్



నవతెలంగాణ-కుభీర్

ఇటీవల గ్రామంలో ఉన్న ఆలయలో అధికంగా వరుస దొంగతనాలు జరరుగుతున్నా నేపథ్యంలో బైంసా సబ్ డివిజన్‌లో ఉన్న అన్ని పోలీస్ స్టేషన్ లో ఉన్న సిబ్బందితో గురువారం బైంసా ఏఎస్పీ అవినాష్ కుమార్ ఆధ్వర్యంలో కుభీర్ మండలంలోని సోనారి గ్రామంలో కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రామ్ నిర్వహించారు. ఉదయం పోలీస్ బలగాలతో గ్రామంలో ప్రతి ఇంటి ఇంటికి వెళ్లి సోదాలు నిర్వహించారు. ఇందులో గ్రామంలో ఎలాంటి పత్రాలు లేకుండా ఉన్న 50 ద్విచక్ర వాహనాలు ఒక ఆటోను గుర్తించారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన సమావేశంలో బైంసా ఏఎస్పీ అవినాష్ కుమార్ మాట్లాడుతూ మద్యం తాగి వాహనాలు నడిపితే రోడ్డు ప్రమాదాల బారినపడి కుటుంబాలు రోడ్డున పడే అవకాశం ఉందన్నారు. అలా నడిపే వారిపై కేసులు నమోదు చేస్తామని అన్నారు. అదే విధంగా మైనర్‌లకు బైకులు, కార్లు ఇచ్చినట్లుతే ముందుగా వారి తల్లిదండ్రులపై కేసు పెట్టడతామన్నారు. అదే విధంగా గ్రామంలో ఎవరైనా నిషేధిత గంజాయి రవాణా చేస్తున్నట్టు గాని విక్రయిస్తున్నట్లు తెల్సిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. ఎలాంటి సమాచారం లేకుండానే కొందరు 100కు డైల్ చేయడం జరుగుతుందని అన్నారు. వారిపై చర్యలు తీసుకుంటామని అన్నారు. ముఖ్యంగా గ్రామంలో వరుస దొంగతనాలు జరుగుతున్నాయని గ్రామంలో ప్రధాన వీధుల గుండా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. ఒక సీసీ కెమెరా వంద మందితో సమానమని అన్నారు. కార్యక్రమంలో బైంసా రూరల్ సీఐ నైలు, కుభీర్ ఎస్సై రవీందర్, గ్రామస్తులు ఉన్నారు.

మొరం తవ్వకాలపై స్పందించిన అధికారులు

నవతెలంగాణ-ఖానాపూర్



నవతెలంగాణ దినపత్రికలో వచ్చిన కరుగుతున్న మొరం గుట్టలు అనే శీర్షిక గురువారం రెవెన్యూ అధికారులు స్పందించారు. ఖానాపూర్ మండలంలోని సింగపూర్ గ్రామ శివారులో పట్టా భూమి నుంచి సుమారు 6 టిప్పర్లలో అక్రమ మొరం రోడ్డు పనులకు ఉపయోగిస్తున్నారని తెలుసుకుని, గురువారం సిబ్బందిని పంపించగా రెవెన్యూ సిబ్బంది రెండు మొరం టిప్పర్లను పట్టుకొని ఖానాపూర్‌కు తరలించారు. కాగా అక్రమ మొరం తవ్వకాలు రవాణాకు పర్మిషన్ ఉందా, లేదా అనే విషయంపై రెవెన్యూ అధికారులు సరైన సమాధానం చెప్పలేకపోతున్నారు. పట్టుకున్న ఈ మొరం రెండు టిప్పర్లకు ఒక్కో దానికి రూ.2500 చొప్పున జరిమానా విధించారు. మొరం తవ్వకాలు జరుగుతున్న ప్రదేశంలో జెసీబీ సహాయంతో సుమారు 6 నుంచి 8 టిప్పర్లు మొరంను అక్రమ రవాణా చేస్తున్నారు. తూతూ మంత్రంగా కేవలం రెండు టిప్పర్లకు మాత్రమే అతి తక్కువ ఫైన్ వేసి రెవెన్యూ అధికారులు చేతులు దులుపుకుంటున్నారు. ఇంత పెద్ద మొత్తం అక్రమ మొరం రవాణాకు జిల్లాస్థాయి అధికారి పర్మిషన్ ఉందని, కొందరు ఎలాంటి పర్మిషన్ లేకుండా, అక్రమంగా రవాణా చేస్తున్నారని మరికొందరు చర్చించుకుంటున్నారు. మొరం తవ్వకాలు జరుగుతున్న భూమి పట్టా భూమి నా, లేక ఇంకా ఇతర భూమీ నా, ఘటన స్థలానికి రెవెన్యూ అధికారులు వెళ్లి సర్వే నిర్వహించాల్సిన బాధ్యత ఉందని ప్రజలు కోరుతున్నారు. పట్టుకున్న ఈ రెండు టిప్పర్లను వదిలేయాలంటూ రెవెన్యూ అధికారులపై తీవ్రమైన ఒత్తిళ్ల ఉన్నట్టు సమాచారం.

ఆదివాసుల సమస్యలు పరిష్కరిస్తాం



నవతెలంగాణ-ఉట్నూర్

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని కవ్వాల్ టైగర్ జోన్ అటవీ ప్రాంతంలో నివసిస్తున్న ఆదివాసీ గిరిజన గుడాల్లో రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో ఏర్పాటు చేసే అన్ని మౌలిక వసతులను ఏర్పాటు చేయటం జరుగుతుందని, కాంగ్రెస్ ఆదిలాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జ్ ఆత్రం సుగుణ అన్నారు. గురువారం ఉట్నూర్ మండల కేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో ఓరుగల్లు వన్యప్రాణుల సంఘం అధ్యక్షుడు నాగేశ్వరరావు ఆధ్వర్యంలోని సభ్యుల బృందం సుగుణను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కవ్వాల్ టైగర్ రిజర్వ్ ప్రాంతంలో నివసిస్తున్న ఆదివాసుల స్థితిగతులపై ఇరువురు సుదీర్ఘంగా చర్చించారు. టైగర్ జోన్ ప్రాంతంలో నివసిస్తున్న ఆదివాసీ గిరిజనులకు ఉపాధి కల్పించి, ఆదుకోవడానికి కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం, సీఎం రేవంత్‌రెడ్డి సానుకూలంగా ఉన్నారని సుగుణ పేర్కొన్నారు. వారి అభ్యున్నతి కోసం తీసుకోవాల్సిన చర్యలపై మంత్రి సీతక్క ప్రత్యేక దృష్టి సారించారని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు, అధికారులు ఉన్నారు.

ప్రయివేట్ డ్రైవర్లకు సంక్షేమ పథకాలు అమలు చేయాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ప్రయివేట్ డ్రైవర్లకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంక్షేమ పథకాలను అమలు చేయాలని ది రాష్ట్రీయ చలక్ ఏక్త మంచ్ జిల్లా అధ్యక్షుడు సోఫిఉల్లా ఖాన్ అన్నారు. గురువారం నేషనల్ ప్రయివేట్ డ్రైవర్స్ డేను నిర్వహించారు. స్థానిక ఉర్దూ భవనంలో కార్యక్రమం ఏర్పాటు చేసి ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన సమావేశంలో డ్రైవర్ల సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా సోఫిఉల్లా ఖాన్ మాట్లాడుతూ స్వాతంత్ర్య ఉద్యమంలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ డ్రైవర్‌గా కర్నల్ నిజామోద్దీన్ పని చేశారన్నారు. తుటాలకు అడ్డు పడి నేతాజీ ప్రాణాలను కాపాడారన్నారు. ఫిబ్రవరి 6న మరణించడంతో ఆయన దహన సంస్కారాల్లో పాల్గొన్న పీఎం మోడీ సేవలను కొనియాడారని తెలిపారు. నిజామోద్దీన్ వర్ధంతిని నేషనల్ డ్రైవర్స్ డేగా పరిగణించారన్నారు. కేవలం నోటి మాటతో కాకుండా ప్రత్యేక హోదా కల్పించాలన్నారు. డ్రైవర్ల సంక్షేమం కోసం ప్రభుత్వాలు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. ఎక్కడైన ప్రమాదం జరిగితే డ్రైవర్ లైసెన్స్‌పై వైద్య సాయం అందించేలా చూడాలని కోరారు. డ్రైవర్లకు గుర్తింపు ఇవ్వాలని, దానికి అనుగుణంగా డ్రైవర్లకు ఏక్తమంచ్ తరపున అవగాహన చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో జాతీయ ఉపాధ్యక్షుడు షేక్ ఇర్ఫాన్, సభ్యులు ఎండీ. కలీం, ముండే బాలాజీ, అభిమన్యు, అయ్యుబ్ పాల్గొన్నారు.

హామీలను అమలు చేయడమే ప్రభుత్వ ఉద్యేశం

నవతెలంగాణ-కడెం

తెలంగాణ రాష్ట్రంలో ఇచ్చిన హామీలను అమలు చేయడం ప్రభుత్వ ఉద్యేశమని మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు రేంకల శ్రీనివాస్ యాదవ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని విలేకరుల సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు, అసెంబ్లీ ఎన్నిక ముందు తెలంగాణ రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలను పక్కగా అమలు చేస్తూ, ఎలాంటి అవకతవకలకు తావు లేకుండా విజయవంతంగా కులగనుల పూర్తి చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వందని వారన్నారు. రాష్ట్రంలో రాబోయే స్థానిక ఎన్నికలలో బీసీలకు న్యాయం జరిగేలా బీసీలకు సీట్లు కేటాయిస్తామని, స్వయంగా రేవంత్‌రెడ్డి తెలియజేయడం హర్షనీయమని పేర్కొన్నారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ సమావేశంలో విపక్షాల నిరసనల మధ్య బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ప్రకటించినందుకుగాను సీఎం రేవంత్‌రెడ్డి, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్‌కు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలియజేశారు.

ఉచిత వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి



నవతెలంగాణ-తలమడుగు

ఉచిత వైద్యశిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ డీఎంహెచ్ఓ సాధన అన్నారు. గురువారం మండలంలోని కజ్జర్ల గ్రామంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని సందర్శించారు. ఈ శిబిరంలో గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అందులో 7గురికి ఎక్స్‌రేలు, 9 మంది రోగులను తెమడ పరీక్షల కోసం రిమ్స్‌కు పంపించారు. అదేవిధంగా పాఠశాల విద్యార్థులకు ఐరన్ మాత్రలు తప్పకుండా అందించాలని వైద్యాధికారులను కోరారు. టీబీ కుష్టు వ్యాధిపట్ల విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆరోగ్యంపై శ్రద్ధ కనబర్చాలంటూ విద్యార్థులను కోరారు. అదేవిధంగా ప్రోటీన్ విటమిన్స్ ఆహారాన్ని తీసుకోవాలని కోరారు. సిగరేట్ గుట్కా మద్యం వంటి అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. వైద్య శిబిరంలో వైద్యాధికారి హరీష్, సూపర్‌వైజర్ యశోద, ఏఎన్ఎం విజయ, ఎంఎల్‌హెచ్‌పీ అనిల్, ఆశా కార్యకర్తలు పుష్ప, లక్ష్మి గ్రామస్తులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనం అదుపు తప్పి ఒకరి మృతి

నవతెలంగాణ-ఖానాపూర్

పంటి నొప్పి ఉందని ఆస్పత్రిలో చూపించుకోని వస్తానని చెప్పి రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సంఘటన గురువారం మామడ మండలంలో చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని సుర్జాపూర్ గ్రామానికి చెందిన పన్నెల భీమేశ్వర్(56) పంటి నొప్పిని ఉందని ఆస్పత్రిలో చూయించుకొని తిరిగి వస్తుండగా మామడ మండలంలోని దిమ్మదుర్తి సమీపంలో ద్విచక్రవాహనం అదుపుతప్పి కిందపడి తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్సై సందీప్ కేసు దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

ఉరేసుకొని యువకుడి ఆత్మ హత్య

నవతెలంగాణ-దహెగాం



పీపీ రావు కాలనికికు చెందిన దుర్గం నితిన్ (22) ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ ఉత్తమ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... పీపీ రావ్ కాలనీకి చెందిన దుర్గం సకారాం కుమారుడు నితిన్ కరీంనగర్‌లో డీఫార్మసీ 6వ సంవత్సరం చదువుతున్నాడు. తన స్నేహితులతో కలిసి వైజాగ్ టూర్ వెళ్ళాడు. బుధవారం వారిని వదిలిపెట్టి ఒంటరిగా ఇంటికి చేరాడు. గురువారం కుటుంబ సభ్యులు వ్యవసాయ పనులకు వెళ్ళిపోయారు. సకారాం పెద్ద కొడుడు ఓం రాజ్ ఊరి నుండి ఇంటికి వచ్చి చూడగా ఇంట్లోని దూలానికి ఉరేసుకొని మృతి చెంది ఉన్నాడు. కుటుంబ సభ్యులకు సమాచారం అందించాడు. ఈ మేరకు మృతుని తండ్రి సకారాం ఇచ్చిన ఫిర్యాదుతో దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేరొన్నారు. తన చావుకు ఎవరు బాద్యులు కాదు, జీవితం మీద విరక్తి తో చనిపోతున్నానని సూసైడ్ నోట్ లభించినట్లు తెలిపారు.

సమ్మక్క సారలమ్మ జాతరకు ఏర్పాట్లు

నవతెలంగాణ-కాగజ్‌నగర్



మినీ మేడారం సమ్మక్క సారలమ్మ జాతరను దృష్టిలో ఉంచుకొని కాగజ్‌నగర్ పట్టణ సమీపంలోని పెద్దవాగు వద్ద ఉన్న సమ్మక్క సారలమ్మ గద్దెల వద్ద ఏర్పాట్లు చేపడుతున్నట్లు జాతర కమిటీ అధ్యక్షుడు తుమ్మ రమేష్ తెలిపారు. ఈ నెల 12 నుండి 15 వరకు మినీ సమ్మక్క సారలమ్మ జాతర ఉన్నందున ఇప్పటి నుండే భక్తులు మొక్కులు తీర్చుకుంటున్నారని, భక్తుల అవసరాలకు తగ్గట్లు ఏర్పాట్లు చేపడుతున్నట్లు తెలిపారు.

వీఓఏలకు ఇచ్చే మెమోలను వెనక్కి తీసుకోవాలి : సీఐటీయూ



నవతెలంగాణ-ఆసిఫాబాద్

వీఓఏలకు ఇచ్చే మెమోలను వెనక్కి తీసుకోవాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజేందర్ అన్నారు. గురువారం డీఆర్‌డీఓకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసిఫాబాద్ మండలంలో మండల సమైక్య ద్వారా వీఓఏలకు మీటింగ్‌కు రానందున మెమో జారీ చేస్తున్నారని తెలిపారు. సీసీతో అనుమతి తీసుకున్న కూడా మెమో ఇవ్వడం సరికాదన్నారు. పీఎఫ్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత, టీఏ, డీఏ లేవని, అతి తక్కువ వేతనాలతో పని చేస్తున్న వారిని ఇబ్బందులకు గురి చేయడం మనుకోవాలన్నారు. ప్రభుత్వం నిర్వహించే ప్రతి కార్యక్రమంలో తను సీసీ కాకపోయినా పాల్గొంటున్నారన్నారు. ఈ విషయాలు ఏపీఎంకు తెలిసిన పట్టించుకోవడం లేదన్నారు. అధికారులు స్పందించి సీసీ కాకపోయినా తన పూర్తి పాత్ర పోషిస్తున్న బోజీరావుపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో జిల్లా వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో శ్రీధర్, స్వామి, మహేష్, రమా, లక్ష్మీ పాల్గొన్నారు.

జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం

నవతెలంగాణ-వాంకిడి

మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం డాక్టర్ ఉప్రే వినయ్ అధ్యక్షతన జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 0 నుండి 19 సంవత్సరాల పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు వేయాలన్నారు. మాత్రలు వేసుకోవడం వల్ల పిల్లలు ఆరోగ్యంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ రియాజ్ అలీ, పంచాయతీ సెక్రటరీలు, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

దేశీదారు పట్టివేత

నవతెలంగాణ-సిర్పూర్(టి)



మహారాష్ట్రలోని గోండుపిప్రి నుండి మండలానికి మోటార్ సైకిల్‌పై అక్రమంగా తరలిస్తున్న 240 దేశీదారు క్వాటర్ బాటిల్స్ పడుకున్నట్లు ఎస్ఐ కమలాకర్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం సమాచారం మేరకు వాహనాలను తనిఖీ చేస్తుండగా మహారాష్ట్ర నుండి దేశీదారు గోండుపిప్రీకి చెందిన చందు సుమారు రూ.13,500 విలువగల మద్యం తరలిస్తుండగా పట్టుకున్నారు. చందును అదుపులోకి తీసుకోని బైక్‌ను సీజ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రెండో ఏఎన్ఎంలకు ప్రభుత్వ హామీ నెరవేర్చాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

రెండవ ఏఎన్ఎంలకు ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చాలని లేని పక్షంలో ఈ నెల 17 నుండి నిరవధిక సమ్మెలోకి వెళ్లామని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ హెచ్చరించారు. కలెక్టరేట్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించే జిల్లా వైద్యాధికారి కార్యాలయంలో సమ్మె నోటీస్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండవ ఏఎన్ఎంలకు ప్రభుత్వం గతంలో ఇచ్చిన హామీలు నెరవేర్చాలన్నారు. హామీని అమలు చేయడంలో కాంగ్రెస్ విఫలమైందన్నారు. ఇచ్చిన హామీని అమలు చేయాలని లేని పక్షంలో బీఆర్ఎస్‌కు పట్టిన గతే కాంగ్రెస్‌కు పడుతుందన్నారు. నోటిఫికేషన్‌లో రెండవ ఏఎన్ఎంల పోస్టులను పెంచాలని, 100శాతం గ్రాస్ సాలరీ ఇవ్వాలని, అర్హత లేనివారికి రూ.10 లక్షల గ్రాట్యూటీ, రూ.10 లక్షల హెల్త్ ఇన్సూరెన్స్ కల్పించాలని, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని, పెండింగ్‌లో ఉన్న ఏడు నెలల పీఆర్సీ వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించాలని లేనిపక్షంలో ఈనెల 17 నుంచి నిరవధిక సమ్మెలోకి వెళ్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు దివాకర్, రెండవ ఏఎన్ఎం యూనియన్ జిల్లా జాయింట్ సెక్రటరీ ప్రమీల, నాయకులు వనిత, పద్మ, జ్యోతి, సత్యవాని, రాజేశ్వరి, వెంకటలక్ష్మి, విజయలక్ష్మి పాల్గొన్నారు.

రబీ లక్ష్యాల సాధన దిశగా పనిచేయాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

రాష్ట్రవ్యాప్తంగా కస్టమ్ మిల్లింగ్ రైస్, రబీ 2024-25 లక్ష్యాల సాధన దిశగా అధికారులు సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కమిషనర్ డీఎస్ చౌహన్ అన్నారు. గురువారం హైదరాబాద్ నుండి భారత ఆహార సంస్థ జనరల్ మేనేజర్, వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ సంచాలకులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల అదనపు కలెక్టర్లు (రెవెన్యూ), జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులు, మేనేజర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సీఎంఆర్, రబీ 2024-25 లక్ష్యాల సాధన దిశగా ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని తెలిపారు. వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియ పకడ్బందీగా నిర్వహించాలని, కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి నిబంధనల ప్రకారం రైతుల వద్ద నుండి నాణ్యమైన ధాన్యం కొనుగోలు చేసి ట్యాగింగ్ కలిగిన రైస్ మిల్లులకు సామర్థ్యానికి అనుగుణంగా తరలించాలని తెలిపారు. వీసీలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎం.డేవిడ్, అధికారులు పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళి పకడ్బందీగా అమలు చేయాలి

- జిల్లా ఎన్నికల అధికారి వెంకటేష్ ధోత్రే



నవతెలంగాణ-ఆసిఫాబాద్

మెదక్-నిజామాబాద్-కరీంనగర్-ఆదిలాబాద్ శాసనమండలి ఎన్నికల సందర్భంగా జిల్లాలు ఎన్నికల ప్రవర్తన నియమావళిని పకడ్బందీగా అమలు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. గురువారం ఎస్పీ శ్రీనివాసరావ్, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎం.డేవిడ్‌తో కలిసి శాసనమండలి సభ్యుల ఎన్నికపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఏర్పాటు చేసిన 17 పోలింగ్ కేంద్రాల పరిధిలో 416 మంది ఉపాధ్యాయులు, సుమారు 6 వేల మంది పట్టభద్రులు ఉన్నారని తెలిపారు. జిల్లాలో ఎన్నికల ప్రవర్తన నియమావళి పకడ్బందీగా అమలు చేయాలని, నిబంధనల ప్రకారం రాజకీయ పార్టీలకు సంబంధించిన హోర్డింగులు, గోడ వ్రాతలు, జెండాలు, ప్రకటనలు తొలగించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఆయా రాజకీయ పార్టీలు, అభ్యర్థులు ఎన్నికల ప్రచారానికి అవసరమైన అనుమతులను తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం నిఘా బృందాలను ఏర్పాటుచేసి పర్యవేక్షించడం జరుగుతుందని తెలిపారు. శాసనమండలి ఎన్నికలకు సంబంధించి తుది ఓటర్ల జాబితాను ఎలాంటి పొరపాట్లకి తావు లేకుండా స్పష్టంగా రూపొందించాలని ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయులు, పట్టభద్రుల ఓటరు దరఖాస్తులను పరిశీలించి ఈ నెల 7లోగా పరిష్కరించాలని, పోలింగ్ కేంద్రాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి అవసరమైన అన్ని వసతులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈనెల 27న ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు కొనసాగే పోలింగ్ ప్రశాంత వాతావరణంలో పారదర్శకంగా జరిగేలా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఎన్నికల సిబ్బందిని నియమిస్తూ వారికి అవసరమైన శిక్షణ అందించేందుకు మాస్టర్ ట్రైనర్లను గుర్తించాలని, ఎన్నికల నిర్వహణకు అవసరమయ్యే బ్యాలెట్ బాక్సులను సరిచూసుకోవాలని, డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ సెంటర్లకు అనువైన ప్రదేశాలను ఎంపిక చేయాలన్నారు. జిల్లాలో ఓటరు హెల్ప్‌లైన్ 1950 ఏర్పాటు చేశామన్నారు. ఎన్నికల నిర్వహణకు నియమించబడిన నోడల్ అధికారులు వారికి కేటాయించిన విధులను బాధ్యతాయుతంగా నిర్వహించాలని, విధుల సంబంధిత కార్యచరణ రూపొందించి నివేదిక సమర్పించాలని ఆదేశించారు. కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

పోషకాహార లోపం నుండి కాపాడుకోవాలి

- యూనిసెఫ్ ఎస్‌బీసీ ఆఫీసర్ సుబ్బిరెడ్డి

నవతెలంగాణ-కెరమెరి

పోషకార లోపం బారిన పడకుండా పిల్లలను కాపాడుకోవాలని యూనిసెఫ్ ఎస్‌బీసీ ఆఫీసర్ సుబ్బిరెడ్డి అన్నారు. పోషకాహార లోపం, నివారణపై గురువారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో యూనిసెఫ్ ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ కార్యదర్శులు, వీఓఏలకు పోషకార లోపంపై ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమంలో పాల్గొని ఆయన మాట్లాడారు. పుట్టిన వెంటనే బిడ్డకు ముర్రుపాలు పట్టించాలన్నారు. పుట్టినప్పటి నుండి రెండేళ్ల వరకు పిల్లల ఎదుగుదలకు కీలకమైన దశని పేర్కొన్నారు. ఈ దశలో పిల్లలను పోషకాహార లోపం బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. 1000 రోజుల (2సం) పాటు పోషక విలువలు కలిగిన ఆహారం అందించాలన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలు, వాటి అమలు తీరుపై వివరించారు. జిల్లాలో ఏడు మండలాలను పైలెట్ ప్రాజెక్టు కింద గుర్తించడం జరిగిందన్నారు. ఈ ఏడు మండలాలలో ఐసీడీఎస్, గ్రామపంచాయతీ, ఐకేపీ శాఖల ఆధ్వర్యంలో గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో సోషల్ అసిస్టెంట్ ప్రాజెక్టు ఆఫీసర్ శ్రీనివాస్, రిసోర్స్ పర్సన్ విఠల్, ఏపీఎం జగదీశ్వర్, అంగన్‌వాడీ టీచర్ స్రవంతి, పంచాయతీ కార్యదర్శులు సతీష్ రావు, వాజిద్, గణేష్, పెంట, ఈశ్వర్, అక్షయ్ పాల్గొన్నారు.



చింతలమానేపల్లి



కెరమెరి

చింతలమానెపల్లి : పిల్లల్లో పోషణ లోపం తగ్గించడం, నివారించడం కార్యక్రమంలో భాగంగా ఏపీపీ రామకృష్ణ, పంచాయతీ కార్యదర్శులు, వీఓఏలకు అవగాహన కార్యక్రమాన్ని బాలాజీ అనుకోడ రైతు వేదికలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీడీ రామకృష్ణ మాట్లాడుతూ పిల్లల్లో పోషణపై అవగాహన కల్గి ఉండాలని, గ్రామాల్లో ప్రతీ ఒక్కరికి మహిళా సంఘాల ద్వారా పోషణ లోపం ఉన్న వారిని గుర్తించి, వారికి సరైన పోషణ అందేలా, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలకు వివరించాలని ఈ సందర్భంగా సూచించారు. కార్యక్రమంలో ఏటీఎం మోహన్ లాల్, దేవానందం, చంద్రశేఖర్, నాగరాణి, మండల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఘనంగా ఎమ్మెల్యే కోవ లక్ష్మి జన్మదిన వేడుకలు

- ఎంఎం ఫౌండేషన్ రక్తదాన శిబిరం
- ఆస్పత్రిలో నాయకుల పండ్ల పంపిణీ



ఆసిఫాబాద్

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ప్రజా నాయకురాలు, ఎమ్మెల్యే కోవలక్ష్మి జన్మదిన వేడుకలు జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. నియోజకవర్గంలోని ఎనిమిది మండలాల్లో నాయకులు ఉదయం నుండి కోవలక్ష్మి నివాసంలో కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. పలువురు ఆమెకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అంతకుముందు ఎమ్మెల్యే భర్త సోనేరావు కలిసి స్థానిక సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించగా అర్చకుడు మధుకర్ శర్మ వారిరువురిని ఆశీర్వదించారు. సింగరేణి జీఎం శ్రీనివాస్ ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యకర్తలకు నాయకులకు ఇంటి ఆవరణలో ఎమ్మెల్యే అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా కేంద్రంతో పాటు జిల్లా వ్యాప్తంగా పలుచోట్ల సేవా కార్యక్రమాలను నిర్వహించారు. ఎంఎం హెల్ప్ లైన్ ఫౌండేషన్ అధ్యక్షుడు ఎండి అహమ్మద్, నాయకుడు వినోద్ జైస్వాల్ కూడా రక్తదానం చేయగా వారికి ఎమ్మెల్యే ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ అలీ బిన్ అహ్మద్, బీఆర్ఎస్ టౌన్ అధ్యక్షుడు అహ్మద్ బిన్ అబ్దుల్లా, పార్టీ మండల అధ్యక్షుడు రవీందర్, మాజీ సర్పంచ్ బలరాం నాయక్, నాయకులు అన్వార్, నిసార్, రవి, జావిద్, ఇమ్రాన్, తాజ్ పాల్గొన్నారు.

తిర్యాణి : ఎమ్మెల్యే కోవ లక్ష్మి జన్మదిన వేడుకలను నిర్వహించారు. కుమురం భీంచౌక్‌లో కేక్‌కట్ చేసి టపాసులు పెల్చారు. ఆస్పత్రిలో పండ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ కమల, వైస్ ఎంపీపీ లక్ష్మణ్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ శ్రీనివాస్, దుస్స మధూకర్, తోట లచ్చన్న, బీఆర్ఎస్ నాయకులు కాసం రాజయ్య, కిలిశెట్టి శంకర్, గాయంగి మల్లేష్ పాల్గొన్నారు.

కెరమెరి : ఆసిఫాబాద్ నియోజకవర్గ శాసన సభ్యురాలు కోవ లక్ష్మి జన్మదిన వేడుకలను గురువారం మండల కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తల ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా కేక్‌కట్ చేసి ఎమ్మెల్యేకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం నాయకులు మిఠాయిలు తినిపించుకున్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పెందోర్ మోతిరాం, మాజీ జడ్పీటీసీ ధ్రుపతబాయి, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ పెందోర్ ఆనందరావు, మాజీ ఎంపీటీసీలు ఇఫ్తేకర్ దేశ్ముక్, గోగర్ల రాజయ్య, నాయకులు షేక్ యునుస్, మడవి రఘునాథ్, జావీద్ ఖాన్, బుచ్చన్న ఆడ రాంచందర్, ఆత్రం భుజంగరావు, సిడం రాజు, సిడం ధర్ము, శంకర్, ఉప్పుల సాయిరాం, రవి, తుకారాం ఉన్నారు.



తిర్యాణి



కెరమెరి

పార్టీ బలోపేతం కోసం పని చేయాలి

నవతెలంగాణ-కాగజ్‌నగర్



పార్టీలో పదవులు ముఖ్యం కాదని, పార్టీ బలోపేతం కోసం పని చేస్తే పదవులు దానంతట అవే వస్తాయని బీజేపీ మాజీ జిల్లా అధ్యక్షులు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్ అన్నారు. రెండు పర్యాయాలు జిల్లా అధ్యక్షునిగా కొనసాగిన ఆయనను గురువారం బీజేపీ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ రానున్న ఎమ్మెల్సీతో పాటు స్థానిక సంస్థల ఎన్నికలలో పార్టీ బలపర్చిన అభ్యర్థులను గెలిపించేందుకు ప్రతీ కార్యకర్త పాటు పడాలని సూచించారు. గ్రామాల్లో కేంద్ర ప్రభుత్వ పథకాలను తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు కె శివకుమార్, మహిళా మోర్చా అధ్యక్షురాలు వి శ్రీదేవి, నాయకులు చేరాల శ్రీనివాస్, కొండు తిరుపతి, మాచర్ల శ్రీనివాస్, రాజేందర్ జంజోడ్, వలపదాసు రమేష్, నికోడె అర్జున్, ప్రశాంత్, మౌనిక, వాణి పాల్గొన్నారు.

పది పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలి

- అదనపు కలెక్టర్ దీపక్ తివారి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

10వ తరగతి వార్షిక ఫలితాలలో జిల్లాను ముందంజలో ఉంచాలని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారి అన్నారు. గురువారం మండల విద్యాధికారులు, ప్రధానోపాధ్యాయులు, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల ప్రత్యేక అధికారులు, ఆదర్శ పాఠశాలల ప్రిన్సిపాళ్లతో 10వ తరగతి వార్షిక పరీక్షలలో ఉత్తమ ఫలితాల సాధన దిశగా చేపట్టాల్సిన చర్యలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 10వ తరగతి వార్షిక పరీక్షలలో జిల్లాను రాష్ట్రంలోని ముందంజలో ఉంచాలన్నారు. 10వ తరగతి వార్షిక పరీక్షలలో విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చూపి అత్యుత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. వార్షిక పరీక్షలకు ప్రణాళిక బద్ధంగా సన్నద్ధం కావాలని, ఎలాంటి ఒత్తిడి, అపోహలు లేకుండా ఏకాగ్రతతో చదవాలని తెలిపారు. మ్యాథ్స్, సైన్స్, ఇంగ్లీష్ వంటి సబ్జెక్టులపై ప్రత్యేక దృష్టి సారించాలని, విద్యార్థులకు అదనపు తరగతులు, ఉదయం, సాయంత్రం వేళలలో స్టడీ అవర్లు నిర్వహించాలని, తరగతిలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, అదనపు తరగతులు నిర్వహించి పరీక్షలకు సన్నద్ధం చేయాలని తెలిపారు. ఉదయం అల్పాహారం, సాయంత్రం స్నాక్స్ విద్యార్థులకు అందించాలని, వారంతా పరీక్షలు నిర్వహించి విద్యార్థుల మార్కుల పురోగతిపై సమీక్షించాలని తెలిపారు. మండల విద్యాధికారులు ప్రతిరోజు 5 పాఠశాలలను సందర్శించాలని, ప్రధానోపాధ్యాయులు తరగతి గదులకు వెళ్లి ఉపాధ్యాయుల బోధన సరళిని పరిశీలించాలన్నారు. పాఠ్యాంశాలు పూర్తి అయితే తిరిగి సిలబస్ పఠనం చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పరీక్షల కమిషనర్ ఉదయ్ బాబు, సమన్వయకర్త శ్రీనివాస్, మండల విద్యాధికారి, ప్రధానోపాధ్యాయులు, ప్రత్యేక అధికారులు, ప్రిన్సిపాళ్ల, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలను తొలగించాలని ధర్నా

- నాలాలు కబ్జాకు గురవుతున్నా పట్టించుకోవడం లేదు



నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్ పట్టణంలోని సాయిబాబా మందిరం వెనుకభాగంలో ఉన్న నాలాను ఆక్రమించుకొని కట్టడాలు జరుపుతున్నారని, వీటిని అరికట్టాలని డిమాండ్ చేస్తూ గురువారం కాలనీవాసులు అక్రమ కట్టడాల వద్ద ధర్నా చేపట్టారు. స్థానిక ఎన్టీఆర్ చౌక్ నుండి రైల్వే ట్రాక్ వరకు ఉన్న నాళాను సాయిబాబా మందిరం వెనుక భాగంలో కొంతమంది ఆక్రమించుకొని కట్టడాలు జరుపడంతో వర్షాకాలం తాము తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, వరద నీరంతా ఇళ్లల్లోకి ప్రవేశిస్తోందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇక్కడ ఒక ప్రైవేట్ స్కూల్ యాజమాన్యం కూడా నాళాలో పిల్లర్ వేసి దానిపై స్లాబ్ నిర్మించి మరీ భవనం నిర్మించారని, భవిష్యత్తులో ప్రమాదం జరిగితే పిల్లలకు ప్రమాదం జరిగే అవకాశముందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై అధికారులు చర్యలు తీసుకునే వరకు తాము ఆందోళన చేపడతామని వారు స్పష్టం చేశారు. విషయం తెలుసుకున్న మున్సిపల్ కమిషనర్ అంజయ్య ధర్నా స్థలానికి వచ్చి విషయం తెలుసుకున్నారు. కబ్జాకు గురవుతున్న నాళాను పరిశీలించారు. అక్రమ కట్టడాలను తొలగిస్తామని హామీ ఇవ్వడంతో కాలనీవాసులు ఆందోళన విరమించారు. వీరికి సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు ఆర్ త్రివేణి, సీపీఐ (ఎం) నాయకులు ముంజం ఆనంద్‌కుమార్‌లు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాగజ్‌నగర్ పట్టణంలో విచ్చలవిడిగా అక్రమ కట్టడాలు జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. పట్టణంలో ఉన్న పెద్ద నాళా రోజు రోజుకు అక్రమణకు గురవుతోందని, ఈ నాళాను అక్రమించి పెద్ద భవనాలు నిర్మించారని ఆరోపించారు. దీనిపై సమగ్ర విచారణ జరిపి అక్రమ కట్టడాలు నిర్మించిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ప్రాథమిక విద్య బలోపేతం చేయాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ప్రాథమిక విద్యను బలోపేతం చేయాలని ఏసీఎంఓ పుర్క ఉద్ధవ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆశ్రమ ఉన్నత పాఠశాలలో జిల్లా క్రీడల అధికారి మీనారెడ్డి స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు జంగుతో కలిసి ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాథమిక విద్యను బలోపేతం చేయడం కోసం ఉపాధ్యాయులు కృత్యాధార విద్యను విద్యార్థులకు అందించాలన్నారు. ఉపాధ్యాయులు ప్రతిరోజు తప్పనిసరిగా సమయసారని పాటించడంతో పాటు టీచింగ్ డైరీలు రాయాలన్నారు. ప్రభుత్వం తీసుకోవచ్చిన కామన్ మెనూ పాటించేలా చర్యలు తీసుకోవాలన్నారు. పాఠశాలలో పరిధిలో బడి ఈడు పిల్లలను గుర్తించి ఇప్పటి నుండే పాఠశాలలో చేర్పించాలన్నారు. విద్యార్థుల స్థాయి తల్లిదండ్రులకు తెలిసే విధంగా వారితో ప్రతి నెల మూడో శనివారం సమావేశం నిర్వహించాలన్నారు. దీనికోసం తల్లిదండ్రులతో ఒక వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు దానిలో పరిస్థితి తెలియజేయాలని సూచించారు. ఉదయం, సాయంత్రం పాఠశాల ప్రారంభం, ముగింపు వేళలు జీపీఆర్ఎస్‌లో ఫోటోలు తీసి పంపించాలన్నారు. ప్రభుత్వ లక్ష్యాన్ని నెరవేర్చే విధంగా ఉపాధ్యాయులు పని చేయాలన్నారు. ఈ సమావేశంలో స్కూల్ కాంప్లెక్స్ ఆర్పీ రాథోడ్ రవీందర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



పేకాట స్థావరాలపై దాడి : 10 మంది అరెస్ట్

నవ తెలంగాణ-లక్షెట్టిపేట



లక్షెట్టిపేటలో ఏకకాలంలో టాస్క్‌ఫోర్స్, సివిల్ పోలీసులు పేకాట స్థావరాలపై దాడులు నిర్వహించి పది మందిని అరెస్టు చేసి రూ.38,400 నగదును స్వాధీనం చేసుకున్నారు. గురువారం లక్షెట్టిపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని మోదెల, లక్ష్మీపూర్ గ్రామాల్లోని పత్తి చేను పొదలలో కొంతమంది జూదరులు రహస్యంగా నిర్వహిస్తున్న పేకాట స్థావరం పై ఆకస్మిక దాడి నిర్వహించి పేకాట ఆడుతున్న దాదాపు పదిమంది పేకాట రాయుళ్ళని పట్టుకున్నారు. మోదెలలో రూ.13120 నగదు, లక్ష్మీపూర్‌లో రూ.25280, మూడు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు. కాగా మరికొందరు నిందితులు పరారయ్యారు. దాడిలో టాస్క్ ఫోర్స్ సీఐ రాజ్ కుమార్, ఎస్సైలు ఉపేందర్, లచ్చన్న, లక్షెటిపేట ఎస్సై పి.సతీష్ కుమార్, టాస్క్ ఫోర్స్ సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీలో వైద్య శిబిరం

నవతెలంగాణ-జన్నారం



మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం-1లో గురువారం వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామంలోని వృద్ధులకు బీపీ, షుగర్ స్క్రీనింగ్ టెస్టులు చేసి మందుల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు పలు సలహాలు అందించారు. ఇంటి చుట్టూ మురుగు కాలువలు లేకుండా చూసుకోవాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ సందీప్, సూపర్‌వైజర్ జంగమ్మ, హెల్త్ అసిస్టెంట్ కొల్లూరి కమలాకర్, ఏఎన్ఎం జిజమాధవి, ఆశా కార్యకర్త రజిత, అంగన్‌వాడీ టీచర్ సంజీవరాణి, ఆయా గుండ మమత పాల్గొన్నారు.

ఫారెస్ట్ ఆంక్షలను తొలగించాలి



నవతెలంగాణ-జన్నారం

కవ్వాల్ టైగర్ ఫారెస్ట్ పేరుతో మండలంలో విధిస్తున్నా ఫారెస్ట్ ఆంక్షలను తొలగించాలని నవతరం స్టూడెంట్ ఫెడరేషన్(ఎన్ఎస్ఎఫ్) రాష్ట్ర అధ్యక్షులు నీరటి రామ్ ప్రసాద్ అన్నారు. గురువారం మంచిర్యాల కేంద్రంలోని జిల్లా అటవీ అధికారి (డీఎఫ్ఓ) కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందించి సమస్యను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొన్ని సంవత్సరాలుగా మండల ప్రజలు కవ్వాల్ టైగర్ రిజర్వ్ ఫారెస్ట్ పేరుతో అటవీ అధికారులు విధిస్తున్నా ఆంక్షలతో అనేక అవస్థలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. అటవీ అధికారులు చెక్ పోస్టుల వద్ద స్థానికులతో దురుసుగా ప్రవర్తిస్తు అడ్డగోలుగా సెస్ వసూళు చేస్తున్నారని ఆరోపించారు. సమస్య ఇంకా తీవ్రం కాకముందే అధికారులు చొరవ తీసుకొని ఆంక్షలు ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. నిర్లక్ష్యం వహిస్తే రానున్న రోజులలో ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర, జిల్లా నాయకులు నీరటి రాకేష్, ఆదిత్య, అభిరామ్, సల్మాన్, సంజయ్ పాల్గొన్నారు.

కాంపోస్టు, అజోలా పెంపకం లాభదాయకమే : డీఆర్డీఓ కిషన్



నవతెలంగాణ-జైపూర్

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ ద్వార పశువుల పాలకలు నిర్మాణానికి పరిమితం కాకుండా నాడెపు కాంపోస్తు, అజోలా పెంపకం కూడ చేపట్టాలని డీఆర్డీఓ కిషన్ సూచించారు. ఎంపీఓ సతీష్ రెడ్డి, ఏపీఎం జీనత్‌తో కలిసి గురువారం భీమారం మండలంలో పర్యటించిన ఆయన ఉపాధి హామీ ద్వార రైతులు నిర్మించుకుంటున్న పశువుల పాకలు పరిశీలించారు. ఈజీఎస్ జాబ్ కార్డు కలిగిఉన్న వారు పశువుల పాకలు నిర్మించుకుంటే రూ.85 వేలు మంజూరు చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా పోలంపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో ఈజీఎస్ ద్వారా నిర్మిస్తున్న పశువుల పాకల నిర్మాణాలను పరిశీలించిన ఆయన రైతులతో మాట్లాడారు. ఎండ వేడి, చలి, వర్షం నుండి పశులకు రక్షణ కల్పించడం కోసం పాకలు నిర్మించుకోవడం అవరమని, పాడి పశువులకు అజోలా పచ్చి మేత అందిస్తే పాల ఉత్పత్తి గణనీయంగా పెరుగుతుందన్నారు. గ్రామ పంచాయతీ పరిధిలో అత్యధికంగా పశువుల పాకలు నిర్మించుకోవడం ఆనందంగా ఉందన్నారు. పశువుల పాకలు నిర్మించుకోవాలంటే గ్రామ పంచాయతీ ద్వార దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. అదేవిధంగా భీమారం మండల కేంద్రంలో నిర్మిస్తున్న పశులు పాకలు, అజోల, గోట్ షెడ్స్, పాఠశాల పరిహారి గోడల నిర్మాణాల తీరును పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన నర్సరీ సందర్శించి నిర్వాహణ తీరును పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కాగా మండల పరిధిలో అసంపూర్తిగా మిగిలిన నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయించాలన్నారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో చింతగూడ వాసి

నవతెలంగాణ-జన్నారం

ఈనెల 27వ తేదీన మెదక్-నిజామాబాద్-ఆదిలాబాద్-కరీంనగర్ నియోజకవర్గ పట్టభద్రుల శాసనమండలి స్థానానికి జరుగనున్న ఎన్నికలో మండలం చింతగూడ గ్రామానికి చెందిన తెలంగాణ ఉద్యమకారుడు మేకల అక్షయ్ కుమార్ పోటీ చేస్తున్నారు. గురువారం కరీంనగర్ కలెక్టరేట్ కార్యాలయంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారికి తన నామినేషన్ పత్రాలను అందజేశారు. అనంతరం రాజ్యాంగంపై విశ్వాసం ఉంచుతానని ప్రమాణం చేశారు. ఆయన వెంట మద్దతుదారులు దొడ్డిపల్లి కుమార్, పూదరి శ్రీకాంత్ పటేల్, జాడి భూమేష్ నేత, కల్వల సాయితేజ ఉన్నారు.

కుటుంబాలకు పరామర్శ

నవతెలంగాణ-జన్నారం

ఖానాపూర్ నియోజకవర్గంలోని కడం పెద్దూర్ తండాకు చెందిన వేణు తండ్రి గుగ్లావత్ బిక్యా, జన్నారం ప్రముఖ పత్రిక విలేఖరి సత్యం తండ్రి ఇటీవల మరణించారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే అజ్మీర రేఖాశ్యాం నాయక్ ఆ బాధిత కుటుంబాలను గురువారం పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆమె వెంట మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ముత్యం సతీష్, డైరెక్టర్లు రజాక్, మున్ను, రాజ్ కుమార్ ఉన్నారు.

'పది'కి పక్కా ప్రణాళిక..

- పాఠశాలల్లో ప్రత్యేక తరగతులు
- పాఠ్యాంశాల వారీగా మోడల్ టెస్టులు
- వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ
- శతశాతం దిశగా కార్యాచరణ



నవతెలంగాణ-లక్షెట్టిపేట

పదోతరగతి పరీక్ష ఫలితాల్లో శతశాతం ఉత్తీర్ణత సాధించడమే లక్ష్యంగా జిల్లా విద్యా శాఖ ఆదేశాల మేరకు మండలంలో అధికారులు ప్రణాళిలు సిద్ధం చేశారు. వార్షిక పరీక్షల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో విద్యార్థుల చదువుపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టింది. ప్రభుత్వ పాఠశాలల్లో ఇప్పటికే రోజువారి ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ప్రత్యేక తరగతులలో భాగంగా వారికి సాయంత్రం సమయంలో స్నాక్ అందించడానికి నిధులు కూడా విడుదల చేశారు. పాఠ్యాంశాల వారీగా ఉపాధ్యాయులు విద్యార్థులకు వచ్చే సందేహాలను నివృత్తి చేస్తున్నారు. మండలంలో వంద శాతం ఉత్తీర్ణత లక్ష్యంగా కృషి చేస్తున్నారు.

టార్గెట్ వందశాతం

మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పదోతరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు వంద శాతం ఉత్తీర్ణత సాధించడమే టర్గెట్ పెట్టుకున్నారు. మండలంలోని వెంకట్రావుపేట ఉన్నత పాఠశాల, జెండా వెంకటాపూర్ ఉన్నత పాఠశాల, జడ్పీ ఉన్నత పాఠశాల బాలికలు, గురుకుల పాఠశాలల్లో రోజువారీగా స్పెషల్ క్లాస్లు నిర్వహిస్తున్నారు. పరీక్షల సమయంలో విద్యార్థులు ఎలాంటి ఒత్తిడి, ఆందోళన చెందకుండా ప్రణాళికబద్ధంగా ముందుకెళ్లే విధంగా అవగాహన కల్పిస్తున్నారు. గత సంవత్సరం కంటే ఈ సంవత్సరం ఉత్తీర్ణత శాతాన్నిమరింత మెరుగు పరిచేలా ముందుకుసాగుతున్నారు.

వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యం

హెలెన్ దారతి, ఎంఈఓ



జిల్లా విద్యాశాఖ ఆదేశాలతో మండలంలోని పాఠశాలల్లో హెచ్ఎంల ఆధ్వర్యంలో గ్రూప్‌లు ఏర్పాటు చేశాం. సామర్థ్యానికి అనుగుణంగా విభజించి పక్క ప్రణాళికతో పనిచేస్తున్నాం. రోజువారీగా ఒక్కో పాఠశాలను ఎంపిక చేసుకుని ఉపాధ్యాయుల బోధన, విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలిస్తున్నాం.

సబ్జెక్టుల వారిగా సందేహాలను నివృత్తి

కె.రమా కళ్యాణి, ప్రిన్సిపాల్ గురుకుల పాఠశాల కళాశాల



ప్రతిరోజు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తూ రోజువారీగా సబ్జెక్టులపరంగా అందరూ ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని బోధిస్తున్నారు. విద్యార్థులకు సబ్జెక్టుపై ఏ సందేహాలన్న నివృత్తి చేస్తున్నాం. 100శాతం ఉత్తీర్ణత లక్ష్యంగా విద్యార్థులకు ప్రతిరోజు, వారాంతపు గ్రాండ్ టెస్టులు నిర్వహిస్తూ వారిని సిద్ధం చేస్తున్నాం.

విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ

నీలకంఠం శ్రీశాంత్, 10వ తరగతి



పదవ తరగతి పరీక్షల నేపథ్యంలో ఉపాధ్యాయులు ప్రతీ సబ్జెక్టును క్షుణ్ణంగా బోధిస్తున్నారు. సబ్జెక్టుల్లో ఉత్తీర్ణత సాధించేందుకు ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారు. 100 శాతం ఉత్తీర్ణత సాధించేందుకు తీవ్ర స్థాయిలో కష్టపడుతున్నాను.

ప్రత్యేక తరగతులపై దృష్టి

చల్లగుల్ల సునంద, హెచ్ఎం జడ్పీహెచ్ఎస్ బాలుర



విద్యార్థులకు ప్రతీరోజు ప్రత్యేక తరగతులతో పాటు టెస్టులు నిర్వహిస్తున్నాం. పరీక్షల విధానంపై అవగాహన కల్పిస్తున్నాం. ప్రత్యేక తరగతులకు హాజరు కానీ పిల్లలపై ప్రత్యేక దృష్టి సారిస్తూ వారి తల్లిదండ్రులను సంప్రదిస్తున్నాం.

నిధుల కేటాయింపులో మొండిచేయి

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి సంకె రవి

నవతెలంగాణ-జైపూర్



కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణకు నిధులు కేటాయించకుండా బీజేపీ ప్రభుత్వం మొండి చేయి చూపించిందని, అదేవిధంగా కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీల అమలులో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి సంకె రవి విమర్శించారు. చెన్నూర్ పట్టణంలో గురువారం ఏర్పాటు చేసిన సీపీఎం ఏరియా కమిటీ సమావేశంలో ఆయన మాట్లడుతూ బీజేపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో వ్యవసాయం, విద్య వైద్యం, సంక్షేమ పథకాలకు నిధులు తగ్గించి కార్పొరేట్ సంస్థలను మరింత బలోపేతం చేయడం కోసం లక్షల కోట్లు కెటాయించిందన్నారు. రైతుల పంటలకు గ్యారెంటీ మద్దతు ధర కావాలని వ్యవసాయ అభివృద్ధికి అధికంగా నిధులు కెటాయించాలని దేశ వ్యాప్తంగా ఆందోళనలు చేస్తున్న ఇచ్చిన హామీలు అమలు చేయకుండా భారీగా తగ్గించిందన్నారు. బీమా రంగంలో ఉన్న డబ్బులను కార్పోరేట్ సంస్థలకు కట్టబెట్టడం కోసం వంద శాతం ఎఫ్డీఐ అమలు చేయాలని నిర్ణయించందని ఆరోపించారు. సంక్షేమ పథకాలక కోత విధించి తమ రాజకీయ ప్రయోజనాల కోసం మాత్రమే బడ్జెట్ కెటాయింపులకు ఉపయోగించుకుందని మండిపడ్డారు. దేశానికి ప్రతినిధి కానట్టుగా కొన్ని రాష్ట్రాలకే పరిమితమై బీజేపీ పాలన కొనసాగుతుందన్నారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రె ఆరు గ్యారంటీల పేరుతో ప్రజలను మభ్యపెడుతుండటం తప్పా ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదన్నారు. గ్రామ పంచాయతీల వారిగా ఒకటికి రెండు సార్లు గ్రామ సభలు నిర్వహించి ధరఖాస్తులు స్వీకరించారని, ప్రజలు ఆశగా ఎదురు చూస్తున్నారన్నారు. అయిన రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు న్యాయం చేసే విధంగా కన్పించడం లేదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరిపై పార్టీ రాబోయే కాలంలో చేపట్టే పోరాటాలకు ప్రజలు సిద్ధంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ(ఎం) ఏరియా నాయకులు బోడంకి చందు, ఉమారాణి, రవి, సరిత, నాగేష్, చంద్రన్న, సత్యం ఉన్నారు.

కాటమయ్య కిట్లతో గౌడలకు రక్షణ



నవతెలంగాణ-జన్నారం

కల్లు గీసేందుకు తాటి చెట్లు ఎక్కే గౌడలకు కాటమయ్య కిట్లు రక్షణగా ఉంటాయని కాటమయ్య రక్ష సెప్టీ కిట్ రాష్ట్ర కో ఆర్డినేటర్ బెల్లం కొండ వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం మండలంలోని బాదం పెల్లి గ్రామంలో ఇంధన్‌పెల్లి, కిష్టాపూర్, జన్నారం, పోన్కాల్ గ్రామాలకు చెందిన గీతా కార్మికులకు లక్షెట్టిపేట్ ఎక్సైజ్ సీఐ సమ్మయ్య ఆధ్వర్యంలో కాటమయ్య రక్ష సెప్టీ కిట్లపై ప్రత్యేక ట్రైనర్లతో శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కర్ణాటక, తమిళనాడు, కేరళ రాష్ట్రాల్లో అక్కడి గీతా కార్మికులు తాటి చెట్లు ఎక్కేందుకు ఉపయోగిస్తున్న రక్షణ కిట్లను పరిశీలించిన తర్వాత నిపుణులతో ప్రభుత్వం వీటిని తయారు చేసిందన్నారు. తాటి చెట్లు ఎక్కేటప్పుడు, దిగేటప్పుడే ప్రమాదం జరగకుండా ఉంటుందన్నారు. గీతా కార్మికులకు శిక్షణ అనంతరం రక్షణ కిట్లను అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్ఐ మౌనిక, బాదంపెల్లి గౌడ సంఘం అధ్యక్షులు నాయిని సత్యాగౌడ్, మండల గౌడ సంఘం అధ్యక్షులు మూల భాస్కర్, ప్రధాన కార్యదర్శి పోడేటి రవి, జిల్లా నాయకులు బాలసాని శ్రీనివాస్, పోడేటి శ్రీనివాస్, ఒల్లాల నర్సాగౌడ్, మండల గౌడ సంఘం మాజీ అధ్యక్షులు పరకాల తిరుపతి పాల్గొన్నారు

అర్హులైన వారికే ఇందిరమ్మ ఇండ్లు

నవతెలంగాణ-జైపూర్



అర్హులకు మాత్రమే ఇందిరమ్మ ఇండ్లు పంపిణీకి అవకాశం ఉంటుందని మండల పరిషత్ అభివృద్ధి అధికారి సత్యనారాయణ అన్నారు. ఎంపీఓ శ్రీపతి బాపురావుతో కలిసి గురువారం గంగిపల్లి, పెగడపల్లి గ్రామాల్లో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇండ్ల పంపిణికి సంబంధించిన రీ సర్వే తీరును పరిశీలించారు. ఇందిరమ్మ ఇల్లు మంజూరైన లబ్దిదారులు నివాసముంటున్న ఇంటి స్థితిగతులతో పాటు ఇంటి నిర్మాణం కోసం అవసరమైన స్థలం తదితర విషయాలపై రీ సర్వే కొనసాగుతున్నట్లు తెలిపారు. అదేవిధంగా గంగిపల్లి గ్రామంలో గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వార నిర్మిస్తున్న పౌల్ట్రీ ఫామ్, నర్సరీల నిర్వాహణ, గ్రామ పంచాయతీల పరిధిలో పారిశుద్ధ్య పనుల తీరును పరిశీలించారు. ఎక్కడ కూడా లోపం జరగకుండా చూడాలన్నారు.పంచాయతీ కార్యదర్శులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శులు ఉదయ్ కుమార్, మల్లేష్, లబ్ధిదారులు పాల్గొన్నారు.

నిధుల కేటాయింపులో తెలంగాణకు అన్యాయం

- ప్రియాంక గాంధీని కలిసిన ఎంపీ వంశీకృష్ణ

నవతెలంగాణ-జైపూర్



తెలంగాణ రాష్ట్రానికి నిధులు కెటాయింపులో అన్యాయం జరుగుతుందని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ అన్నారు. కాంగ్రెస్ ముఖ్య నేత ప్రియాంక గాంధీని గురువారం ఢిల్లీలో కలిసి తెలంగాణకు జరుగుతున్న అన్యాయాన్ని వివరించారు. కేంద్రంతో పార్టీ కొట్లాడైనా తెలంగాణకు అన్యాయం జరుగకుండా చూడాలని కోరారు. ప్రియాంక గాంధీ నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసిన వంశీకృష్ణ తెలంగాణ ప్రయోజనాలు పట్ల అధిష్టానం సరైన రీతిలో స్పందించాలని కోరారు. తెలంగాణ అభివృద్ధి, ప్రజల సమస్యలు, భవిష్యత్ కార్యాచరణ తదితర విషయాలపై ఆమెతో చర్చించారు. సింగరేణి, వ్యవసాయం, పరిశ్రమల అభివృద్ధి, రోడ్లు, రైల్లు, ప్రాజెక్టుల అభివృద్ధికి తగిన నిధులు కెటాయించకపోవడం బాధాకరమన్నారు. ప్రధానంగా పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలో ప్రాజెక్టులు, ఉపాధి అవకాశాలు, విద్య వైద్యం అభివృద్ధికి సంబంధించిన నిధుల కెటాయింపుకు కాంగ్రెస్ నాయకత్వం తీవ్రంగా కృషి చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కాగా తెలంగాణకు అన్యాయం జరుగకుండా సరైన విధంగా నిధుల కెటాయింపుకు పార్టీ పోరాడుతుందని ప్రియాంక గాంధీ హామీ ఇచ్చినట్లు తెలిపారు. అదేవిధంగా ఈ విషయమై కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచడానికి పార్టీ స్థాయిలో ప్రయత్నాలు జరుగుతాయని ఆమె స్పష్టం చేసినట్లు పేర్కొన్నారు.

ఆత్మగౌరవాన్ని విస్మరించిన సీఎం



నవతెలంగాణ-జన్నారం

ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసెంబ్లీ సాక్షిగా నేతకాని కులాన్ని 1,33,072 వేల జనాభా మాత్రమే కలిగి ఉందని ప్రకటన చేయడానికి నేతకాని సంక్షేమ సంఘం తీవ్రంగా ఖండిస్తుందని ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు తాళ్లపల్లి రాజేశ్వర్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ జాడి గంగాధర్, మండల అధ్యక్షుడు రత్నం లక్ష్మణ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన పత్రిక విలేకరులతో మాట్లాడారు. తెలంగాణలోని గోదావరి పరివాహక ప్రాంతమైన ఖమ్మం జిల్లా నుండి నిజామాబాద్ వరకు సుమారు 15 లక్షల నుండి 18 లక్షల వరకు నేతకాని జనాభా ఉందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి వాస్తవాలు చెప్పకుండా తప్పుడు లెక్కలు చెప్పి, నేతకాని కులాన్ని తక్కువ జనాభా కలిగి ఉందని చూపెట్టడం బాధాకరమన్నారు. దీని వెనక రాజకీయ కుట్రలు ఉందన్నారు. రాజకీయ రంగాల్లో నేతకాని సమాజానికి వచ్చే వాటాలో లబ్ది చేకూరుతుందని ఇలాంటి ప్రకటనలు చేస్తున్నారన్నారు. తెలంగాణ రాష్ట్రంలో మాల మాదిగ కులాల తర్వాత మూడవ స్థానంలో నేతకాని కుల జనాభానే అధికంగా ఉందన్నారు. ప్రభుత్వంపై నేతకాని కులాస్తుల హక్కులను సాధించుకునే వరకు పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నేతకాని సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకులు బోర్లకుంట ప్రభుదాస్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ జాడి వెంకట్, మహ్మదాబాద్ మాజీ సర్పంచ్ శునార్కార్ లక్ష్మణ్, డాక్టర్ రవి శంకర్, జునుగురి మల్లయ్య, దుర్గం నందయ్య, అరగడ్డ దత్తు, ప్రేమ్ కుమార్, తాళ్లపల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.

భీమారం ఐటీడీఏ కాలనీలో చోరీ

నవతెలంగాణ-జైపూర్

భీమారం మండల కేంద్రం ఐటీడీఏ కాలనీకి చెందిన రామటెంకి రంజిత్‌కుమార్ ఇంట్లో చోరీ జరిగినట్లు ఎస్సై శ్వేత తెలిపారు. జనవరి 31న కుటుంబ సభ్యులతో కలిసి సిద్దిపేట్ వెళ్లిన రంజిత్ తిరిగి ఈ నెల 5న ఇంటికి వచ్చాడు. ఇంట్లో ఉన్న రూ.50వేల నగదుతో పాటు రూ.42వేలు విలువ గల బంగారు గొలుసు దొంగతనం జరిగినట్టు గుర్తించాడు. బాధితుడు రంజిత్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ పేర్కొన్నారు.

నాయీబ్రాహ్మణ సేవా సంఘం పట్టణ కమిటీ ఎన్నిక



నవతెలంగాణ-జన్నారం

నాయీబ్రాహ్మణ సేవా సంఘం పట్టణ కమిటీని గురువారం ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు గొల్లపల్లి వెంకటరమణ, కస్తూలాపురి నరేందర్, రాచకొండ భూమయ్య ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పట్టణ గౌరవ అధ్యక్షులుగా కస్తూలాపూరి చంద్రయ్య, అధ్యక్షులుగా రాచకొండ రాజేష్, ఉపాధ్యక్షులుగా కుదురుపాక శంకర్, ప్రధాన కార్యదర్శిగా మర్రిపల్లి శేఖర్, కోశాధికారిగా మందనూరి గంగన్న, జాయింట్ సెక్రెటరీగా మెట్పల్లి సత్తన్న ఎన్నికయ్యారు. ఎన్నికైన వారిని శాలువా, పూలమాలలతో సత్కరించారు.

అదనపు ఎస్ఐ తానాజీ సేవలు మరువలేనివి

నవతెలంగాణ-జన్నారం



మండల అదనపు ఎస్ఐ తానాజీ చేసిన సేవలు మరువలేనివని బీజేపీ జిల్లా నాయకుడు గోలిచందు అన్నారు. అదనపు ఎస్ఐ తానాజీ ఇటీవల గుండెపోటుతో మృతిచెందారు. దీంతో గురువారం పట్టణంలో తానాజీ చిత్రపటానికి ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. రెండు నిమిషాల మౌనం పాటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అదనపు ఎస్ఐగా తానాజీ మండల ప్రజలతో మమేకమై పని చేశారన్నారు. తానాజీ చేసిన సేవలను మండల ప్రజలు గుర్తుపెట్టుకుంటారన్నారు. కార్యక్రమంలో పలువురు హమాలీలు పాల్గొన్నారు.

భారత క్రీడారత్న అవార్డు గ్రహీతకు సన్మానం

నవతెలంగాణ-మందమర్రి



పాత బస్టాండ్ ప్రాంతానికి చెందిన అంతర్జాతీయ కరాటే క్రీడాకారుడు పఠాన్ జమీల్ ఖాన్ భారత క్రీడారత్న అవార్డు స్వీకరించిన సందర్భంగా కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు నోముల ఉపేందర్‌గౌడ్ ఆధ్వర్యంలో సన్మానించారు. భవిష్యత్తులో మరిన్ని అవార్డులు సొంతం చేసుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం అడిషనల్ కలెక్టర్ మోతీలాల్ జమీల్‌ఖాన్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో గుడికందుల రమేష్, కనకయ్య గౌడ్ హృదయరాజ్, అంకం రాజ్‌కుమార్, శ్రీధర్, సాగర్, రవి, మహేష్, స్వామి, భూషణ్, పోశం, చంద్రకాంత్ పాల్గొన్నారు.

సొనాల మండల కార్యాలయాన్ని ప్రారంభించిన కలెక్టర్

నవతెలంగాణ-బోథ్



నూతనంగా ఏర్పాటైన సొనాల మండలాన్ని గురువారం జిల్లా కలెక్టర్ రాజర్షి షా ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల సౌలభ్యం కోసం కొత్త మండలాలు ఏర్పడ్డాయని తెలిపారు. కార్యాలయంలో పనిచేస్తున్న ప్రతి ఉద్యోగి ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్యామలదేవి, జడ్పీ సీఈవో జితేందర్‌రెడ్డి, ఆర్‌డీఓ వినోద్ కుమార్, తహసీల్దార్ సుభాష్ చంద్ర, ఎంపీడీవో రమేష్ పాల్గొన్నారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

- అదనపు కలెక్టర్ దీపక్ తివారి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ డెవలప్మెంట్ (టాస్క్) కేంద్రంలో అభ్యర్థులకు ఇస్తున్న శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారి తెలిపారు. గురువారం జిల్లా కేంద్రంలోని టాస్క్ సెంటర్‌ను జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి దత్తారాంతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ డెవలప్‌మెంట్ సెంటర్ ఆధ్వర్యంలో అందిస్తున్న నైపుణ్య శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. శిక్షణకు నమోదు చేసుకున్న అభ్యర్థులు ఏకాగ్రతతో శిక్షణలో అందిస్తున్న అంశాలను నేర్చుకోవాలని, కేంద్రంలో పొందిన శిక్షణను వినియోగించుకుని భవిష్యత్తులో రాణించాలన్నారు. ఈ సందర్భంగా శిక్షణ పొందుతున్న అభ్యర్థులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో టాస్క్ మేనేజర్ సాయి, అధికారులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలి

- మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్

నవతెలంగాణ-నస్పూర్



వేసవి కాలం సమీపిస్తున్నందున జిల్లాలో తాగునీటి ఎద్దడి సమస్య తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో నిరంతరంగా నీటిని అందించే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలో డీపీఓ వెంకటేశ్వర్‌రావు, జడ్పీ సీఈఓ గణపతి, ఆర్‌డబ్ల్యుఎస్, మిషన్ భగీరథ అధికారులతో కలిసి ఏఈలు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలతో సమీక్షించారు. వేసవికాలంలో జిల్లాలోని ప్రజలకు తాగునీటి సమస్య లేకుండా నిరంతరాయంగా సరఫరా చేసే విధంగా కార్యచరణ రూపొందించి అమలు చేయాలని తెలిపారు. మిషన్ భగీరథ పథకంలోని మంచిర్యాల, నస్పూర్ మున్సిపాలిటీలలోని వార్డులకు అవసరమైన మేరకు తాగునీటిని అందించాలన్నారు. మిషన్ భగీరథలో పైప్లైన్ల లీకేజీ కారణంగా కలుషిత నీరు రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, అనుమానిత నీటిని పరీక్షించి తగు చర్యలు తీసుకోవాలని తెలిపారు. అమృత్ 2.0 పథకం కింద చేపట్టిన పనులను త్వరితగతిన పూర్తి చేసి వేసవి కాలంలో నీటిని అందించేందుకు సిద్ధం చేయాలని తెలిపారు. పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, తాగునీటిని అందించే ఓవర్‌హెడ్ ట్యాంక్లను సమయానుసారంగా శుభ్రపరచాలని, మున్సిపల్ పరిధిలోని వార్డులలో ప్రతి ఇంటి నుండి ప్రతి రోజు తడి, పొడి చెత్తను సేకరించి డంపింగ్ యార్డుకు తరలించాలని తెలిపారు. 3-4 సంవత్సరాలుగా జిల్లాలో తాగునీటి సమస్య ఉన్న ప్రాంతాలను గుర్తించి పూర్తి వివరాలతో నివేదిక అందించాలని అధికారులను ఆదేశించారు.

గుండి అప్రోచ్ రహదారి నిర్మించాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రం నుండి గుండి అండర్‌పాస్ వరకు ఉన్న అప్రోచ్ రహదారిని వెంటనే నిర్మించాలని డివైఎఫ్ఐ, టిఏజిఎస్ నాయకులు డిమాండ్ చేశారు. కలెక్టరేట్ ఏఓ మధుకర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు టీకానంద్ మాట్లాడుతూ జిల్లా కేంద్రంలోని ప్రధాన రహదారి నుండి గుండి అండర్ పాస్ వరకు ఉన్న రహదారి పూర్తిగా చెడిపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ ప్రాంతంలో రాత్రిపూట ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. ప్రధాన రహదారి నుండి అండర్ పాస్ వరకు డిబిఎల్ కంపెనీ ఆధ్వర్యంలో రహదారి నిర్మించాల్సి ఉన్న నిర్లక్ష్యం చేసి రహదారి పూర్తి చేయకుండానే వెళ్ళిపోయారని ఆరోపించారు. కంపెనీపై చర్యలు తీసుకోవడంతో పాటు వెంటనే రహదారి నిర్మాణానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గొడిసెల కార్తీక్, టిఏజిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు కోట శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆరోగ్య కేంద్రంలో ఆశా డే

నవతెలంగాణ-తాండూర్

తాండూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఝాన్సీ ఆధ్వర్యంలో గురువారం ఆశా డే నిర్వహించారు. నులిపురుగుల నివారణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. సంవత్సరం నుండి 19 సంవత్సరాల వయసున్న పిల్లలందరికీ అల్బెండజోల్ టాబ్లెట్‌ను పంపిణీ చేయాలన్నారు. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం ఫిబ్రవరి 10న ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలలలో అంగన్‌వాడీ సెంటర్స్‌లో నిర్వహించడం జరుగుతదని తెలిపారు. కార్యక్రమంలో మండలంలోని ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

క్యాలెండర్, డైరీ ఆవిష్కరణ

నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని మల్కెపల్లి ఆశ్రమ పాఠశాలలో తెలంగాణ రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ ఉపాధ్యాయ సంఘం 2025 సంవత్సర క్యాలెండరు, డైరీని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు మంగ నారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి చందు, భీమయ్య, అంబారావు, ఏటీడబ్ల్యూవో పురుషోత్తం, హెచ్‌ఎం లక్ష్మయ్య, ఆదివాసీ నాయక్‌పోడ్ సేవా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొమ్ముల బాపు, మాజీ ఎంపీపీ సిడాం జంగు, బూనేని రాజేశ్వరి, మంగ రమాదేవి పాల్గొన్నారు.

విత్తనాలు ఎరువులపై అవగాహన పెంచుకోవాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

పంటలకు కావాల్సిన విత్తనాలు ఎరువులపై డీలర్లు ఎప్పటికప్పుడు అవగాహన పెంచుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు తెలిపారు. జిల్లా కేంద్రంలోని జనకపూర్ రైతు వేదికలో డీలర్లకు మేనేజ్ సమితి ఆత్మ సౌజన్యంతో డిప్లమా ఇన్ అగ్రికల్చరల్ సర్వీసెస్ ఫర్ ఇన్పుట్ డీలర్స్ (దేశి) ద్వారా ఇస్తున్న శిక్షణ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎరువులు విత్తనాలు పురుగుల మందుల దుకాణ యజమానులకు సంవత్సరం పాటు ఎరువులపై ప్రతి ఆదివారం ప్రత్యేక తరగతులు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ శిక్షణ తరగతులకు హాజరైన డీలర్లకు ప్రత్యేక డిప్లొమా సర్టిఫికెట్లు అందజేయడం జరుగుతుందన్నారు. పురుగు మందుల లైసెన్సులు తీసుకోవటానికి అర్హత వస్తుందని, ఎవరైనా కొత్తగా లైసెన్సు తీసుకోవాలనుకున్న వారు కూడా ఈ దేశీ డిప్లమాను చేసి లైసెన్సులు పొందవచ్చన్నారు. డీలర్లు క్రమం తప్పకుండా తరగతులకు హాజరు అయ్యి డిప్లొమా కోర్సును విజయవంతంగా పూర్తి చేసి రైతులకు సరియైన సూచనలు అందించి వ్యవసాయ అభివృద్ధికి పాటుపడాలన్నారు. ఇందులో సహాయ వ్యవసాయ సంచాలకులు జాడి మిలింద్ కుమార్, దేశీ ప్రోగ్రాం ఫెసిలిటేటర్ చునార్కార్ సావన్, వ్యవసాయ అధికారులు మంజుల, రామకృష్ణ, విజయ్, దీప్తి, వ్యవసాయ విస్తరణ అధికారులు చిరంజీవి, వెంకటేష్, రాము పాల్గొన్నారు.

అక్రమ డీజీల్ సరఫరా స్థావరంపై దాడులు



నవతెలంగాణ - కాసిపేట

మండలంలోని దేవాపూర్ సల్పాలవాగు, కొండాపూర్ యాప రహదారి మధ్య కొండాపూర్ శ్మశాన వాటిక సమీపంలో అక్రమ డీజిల్ సరఫరా స్థావరంపై బుధవారం రాత్రి సివిల్ సప్లై అధికారులు మెరుపు దాడి చేశారు. సివిల్ సప్లై అధికారి వేణుగోపాల్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ అంజయ్య ఆధ్వర్యంలో దాడి చేసి అక్రమ డీజిల్ ట్యాంకర్‌ను అదుపులోకి తీసుకున్నారు. పెద్ద డీజిల్ ట్యాంకర్‌కు పంపు ఏర్పాటు చేసి సిమెంట్ కంపెనీకి రవాణా చేసే లారీల ట్రాన్స్‌పోర్ట్ నిర్వాహలు అక్రమంగా స్థావరం ఏర్పాటు చేసి లారీలకు డీజీల్ పోస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. సివిల్ సప్లై అధికారులకు సమాచారం అందడంతో దాడులు చేశారు. భారీ డీజీల్ ట్యాంకర్, ఒక పంపుతో పట్టు బడ్డారు. ఇలా అక్రమంగా ట్యాంకర్ ఏర్పాటు చేసి ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్న వ్యవహారంపై లోతుగా విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

స్వీయ రక్షణ కోసం సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి



నవతెలంగాణ-మందమర్రి

స్వీయ రక్షణ కోసం సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఎస్ఐ రాజశేఖర్ తెలిపారు. పట్టణంలోని అన్నపూర్ణ టిఫిన్ సెంటర్‌లో గురువారం నాలుగు సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. సీసీ కెమెరాలు రహదారిని కవర్ చేసే విధంగా ఏర్పాటు చేసినందుకు ఎస్ఐ టిఫిన్ సెంటర్ యాజమాని వెంకన్నను సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ప్రజలు తమ స్వీయ రక్షణ కోసం సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, ఒక్క సీసీ కెమెరా 100 మంది పోలీసులతో సమానమని తెలిపారు.

ఘనంగా రమాబాయి జయంతి ఉత్సవాలు

నవతెలంగాణ-నస్పూర్

సింగరేణి కాలరీస్ ఎస్సీ ఎస్టీ ఉద్యోగస్తుల వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం రమాబాయి జయంతి ఉత్సవాలు అంబేద్కర్ కాలనీలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రథసారథి డీజీఎం (ఐఈడీ) చిరంజీవులు, ఏరియా లైజనింగ్ ఆఫీసర్ కె.కిరణ్ కుమార్, శ్రీరాంపూర్ వైస్ ప్రెసిడెంట్ డేగల ప్రవీణ్‌కుమార్ మాట్లాడారు. రమాబాయి త్యాగానికి ప్రతిరూపమని, అంబేద్కర్ ఆశయాలను నెరవేర్చడంలో ఆయన వెన్నంటే ఉన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నరేష్, సుమన్, లక్ష్మణ్, వెంకటేష్, యుగంధర్, సాయియూసుఫ్, ప్రవీణ్, కిరణ్ పాల్గొన్నారు.



ఉచిత శిక్షణకు దరఖాస్తులు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్
ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని బీసీ, ఎస్సీ, ఎస్టీ ఈబీసీ డిగ్రీ పాసైన అభ్యర్థులకు బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో ఆర్ఆర్‌బి, ఎస్ఎస్‌సి అండ్ బ్యాంకింగ్ రిక్రూట్‌మెంట్ ఫౌండేషన్ కోర్సుకు ఉచిత శిక్షణకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు బీసీ జిల్లా అభివృద్ధి అధికారి రాజలింగు, డైరెక్టర్ ప్రవీణ్ కుమార్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ఉచిత శిక్షణకు అర్హులైన అభ్యర్థుల ఫిబ్రవరి 9 వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఉచిత శిక్షణ 15 నుంచి ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. నాలుగు నెలల ఉచిత శిక్షణ ఉంటుందని, అభ్యర్థులు ఆన్‌లైన్ వెబ్‌సైట్ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.టీజీబీసీస్టడీసర్కిల్.సీజీజీ.గ వ్.ఇన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. అభ్యర్థులకు బుక్ ఫండ్, ప్రతినెల స్టైఫండ్ ఇస్తామని పేర్కొన్నారు. తల్లిదండ్రుల ఆదాయం గ్రామీణ ప్రాంతాల్లో రూ.లక్షా 50వేల లోపు, పట్టణ ప్రాంతాల్లో రూ.2లక్షలలోపు ఉండాలని, అభ్యర్థుల ఎంపిక విధానం రూల్ ఆఫ్ రిజర్వేషన్, ఇంటర్మీడియట్, డిగ్రీ పరీక్షలో వచ్చిన మార్కుల ఆధారంగా ఉంటుందని తెలిపారు. అర్హులైన అభ్యర్థులకు సర్టిఫికెట్ వెరిఫికేషన్ ఫిబ్రవరి 12 నుంచి 14 వరకు ఉంటుందని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 08732-221280 నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

బీజేపీ మండలాధ్యక్షుడికి సన్మానం

నవతెలంగాణ-సారంగాపూర్
ఇటీవల బీజేపీ మండలాధ్యక్షుడిగా పదవీ బాధ్యతలు స్వీకరించిన కాల్వ నరేష్‌ను గురువారం మండల కేంద్రంలో పదవ తరగతి-2005 బ్యాచ్ మిత్రులు నరేష్‌ను శాలువా పూలమాలలతో సన్మానించి, శుభాకాంక్షలు తెలిపి పార్టీకి పదవీకి సరైన న్యాయం చేస్తూ, ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేసి మంచి పేరు తెచ్చుకోవాలని ఆకాంక్షించారు.

తునికాకు సేకరణకు టెండర్లు పిలువాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్
గిరిజనులు, పేదలకు తునికాకు సేకరణ ఉపాధిని కల్పిస్తున్నదని, ప్రతిఏటా డిసెంబర్, జనవరి నుంచే సేకరణ ప్రక్రియకు సంబంధించిన పనులను అటవీశాఖ మొదలు పెట్టేదని గురువారం టీఏజీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూసం సచిన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటిదాక టెండర్ల ప్రక్రియనే పూర్తవ్వలేదని, తునికాకు సేకరణ టెండర్లు పిలువాలని కోరారు. కొమ్మకొట్టుడు ప్రక్రియను మొదలు పెట్టలేదని తెలిపారు. టెండర్లను ఫ్రూనింగ్ ప్రక్రియలను సకాలంలోనే పట్టుకుంటే లక్షలాది మంది పేదల ఉపాధికి గండి పడే అవకాశముందని పేర్కొన్నారు. తునికాకు సేకరణ పనుల జాప్యంతో దీనిపై ఆధారపడిన ఆదివాసీలు, గిరిజనులు, గిరిజనేతరులు ఆందోళనలో ఉన్నారని తెలియజేశారు. టెండర్లు నిర్వహించకపోతే, తమ ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్ అయినా సరే నేరుగా ఆకు సేకరించవచ్చని, ఈ రెండిటిలో ఏదో ఒకటి సత్వరమే నిర్ణయం తీసుకొని పది రోజుల్లో ఫ్రూనింగ్ పనులు ప్రారంభించాలని కోరారు.

రాష్ట్ర కమిటీలో జిల్లా వాసికి చోటు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్
ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి ఐక్య ఫెడరేషన్ రాష్ట్ర జనరల్ కౌన్సిల్ సమావేశం ఫిబ్రవరి 4, 5వ తేదీల్లో జరిగాయి. జనరల్ కౌన్సిలింగ్‌లో జిల్లాకు చెందిన కుమ్ర అశోక్‌ను రాష్ట్ర కమిటీ సహప్రధాన కార్యదర్శి సభ్యునిగా ఎన్నుకున్న పీడీఎస్‌యూ జిల్లా కమిటీ సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు.

సీసీరోడ్డు నిర్మాణంలో నాణ్యతా లోపం

- అభివృద్ధి పేరుతో నాసిరకం పనులు



నవతెలంగాణ-నేరడిగొండ
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి, మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తోంది. అందులో భాగంగా మండలంలోని వాగ్దారి గ్రామంలో ఎన్ఆర్ఈజీఎస్ కింద రూ.5లక్షలతో చేపడుతున్న సీసీరోడ్డు నిర్మాణ పనులు చేపట్టగా ఆ పనులు నాణ్యతా లోపంగా కొనసాగుతున్నాయని గ్రామస్తులు పలువురు ఆరోపించారు. సీసీ రోడ్డు నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించడం లేదని, అధికారుల పర్యవేక్షణ లేకుండా పనులు చేపట్టడం ఎంటని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. చేపట్టే పనుల మన్నికగా ఉండేలా ఉండాలని, మూడునాళ్ల ముచ్చటగా ఉండకూడదని అభిప్రాయం వ్యక్తం చేశారు. సీసీ నిర్మాణానికి వాడాల్సిన మెటీరియల్ నాసిరకంగా వాడుతున్నారని పేర్కొన్నారు. సదరు గుత్తేదారు ఇష్టానుసారంగా పనులు చేపట్టడం అధికారులకు సైతం తెలియకుండా సీసీ రోడ్డు పనులు చేయడమంటే నాణ్యత లేకుండా చేపట్టడమేనని పలువురు ఆరోపించారు. ఈ విషయమై పీఆర్‌జేఈ దినేష్‌ను వివరణ కోరగా పనులు ప్రారంభించిన విషయం తెలియదని తెలిపారు. అదేవిధంగా ఎన్నికల కోడ్ ఉన్నందున పనులు ప్రారంభించరాదని తెలిపారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ప్రమాద స్థలాలను పరిశీలించిన డీఎస్పీ

నవతెలంగాణ-తలమడుగు
ఆదిలాబాద్ నుంచి మహారాష్ట్రకు వెళ్లే అంతరాష్ట్ర రహదారిలో తరచు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో ఆయా ప్రమాదాలు జరుగు స్థలాలను గురువారం డీఎస్పీ జీవన్‌రెడ్డి ఆర్ అండ్ బి అధికారులతో కలిసి పరిశీలించారు. ఇటీవల మండలంలోని ఖోడద్ గ్రామ సమీపంలో మూలమలుపు వద్ద జరిగిన ప్రమాద స్థలాన్ని పరిశీలించారు. చుట్టు ఉన్న చెట్ల పొదలను తొలగించారు. అదేవిధంగా రోడ్డుకు ఆనుకొని ఎలాంటి నిర్మాణాలు చేపట్టవద్దని, రోడ్లపై ఎలాంటి వాహనాలు పార్కింగ్ చేయవద్దని అన్నారు. అదేవిధంగా రోడ్డు పక్కనే గేదెలను, ఎడ్లను కట్టివేయద్దన్నారు. ప్రజలు వాటికి సహకరించాలని



వెంటనే అలా ఉన్న వాటిని తొలగించాలని కోరారు. డీఎస్పీ వెంట తాంసి ఎస్సై రాధిక, తలమడుగు ఎస్సై అంజమ్మ, మాజీ సర్పంచ్ ఆనంద్ గ్రామస్తులు ఉన్నారు.

అశోక్ కుమార్‌ను ఎమ్మెల్సీగా గెలిపించుకుందాం



నవతెలంగాణ-ఉట్నూర్
టీపీటీఎఫ్ అభ్యర్థి వై.అశోక్ కుమార్‌ను ఎమ్మెల్సీగా గెలిపించాలని టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఆత్రం భుజంగ్ రావ్ అన్నారు. గురువారం పట్టణంలోని ప్రెస్‌భవనంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యా రంగం అభివృద్ధి చెందాలంటే విద్యా రంగానికి చెందిన వారిని గెలిపించాలని, కార్పొరేట్ వ్యక్తులను, ధనస్వామిక వ్యక్తులను ఓడించి, ఎల్లప్పుడూ విద్య కొరకు, ఉపాధ్యాయుల సంక్షేమం కోసం పనిచేసే అశోక్ కుమార్‌ను గెలిపిద్దామని ఉట్నూర్ ప్రెస్‌భవన్ నుంచి ఉపాధ్యాయ మిత్రులకు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జ్ఞానేశ్వర్, యూటీఎఫ్ నాయకులు శ్రీనివాస్, టీపీటీఎఫ్ కుమురంభీమ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కనక వెంకటేశ్వర్ రావ్, టీపీటీఎఫ్ జిల్లా మహిళా నాయకురాలు గంగాసాగర్ పాల్గొన్నారు.

టీచర్ ఎమ్మెల్సీ బరిలో డీటీయూ అభ్యర్థిగా రాజేషుడు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్
ధర్మా టీచర్స్ యూనియన్ (డీటీయూ) రాష్ట్ర కమిటీ తరపున ఆదిలాబాద్, కరీంనగర్, మెదక్, నిజామాబాద్ టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా కృష్ణపెల్లి రాజేషుడును బరిలో ఉంటున్నట్టు ధర్మా టీచర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు నాతరి రమేష్ తెలియజేశారు. గురువారం పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్సీ అభ్యర్థిగా రిటైర్డ్ టీచర్ కృష్ణపెల్లి రాజేషుడు అభ్యర్థిగా ప్రకటించడం జరిగిందని అన్నారు. కార్యక్రమంలో ధర్మా టీచర్స్ యూనియన్ కార్యవర్గ సభ్యులు



ఎల్మాల నగేష్, బొర్రా నగేష్, అడెల్లు రాచర్ల నారాయణ పాల్గొన్నారు.

ఘనంగా వెంకటేశ్వర స్వామి కల్యాణోత్సవం

నవతెలంగాణ-జైనథ్
మండలంలోని కూర గ్రామంలో గురువారం శ్రీవెంకటేశ్వర స్వామి కల్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు. ఉత్సవానికి చుట్టుపక్కల గ్రామాలకు చెందిన ప్రజలు, నాయకులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా మండల కిసాన్ మోర్చా అధ్యకులు ఏనుగు రాకేష్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం భక్తిశ్రద్ధలతో స్వామివారి కల్యాణోత్సవం నిర్వహిస్తామన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం చేపడతామని తెలిపారు.



అశోక్ కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలి

నవతెలంగాణ-నిర్మల్‌టౌన్
ఈ నెల 27న జరగనున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీఎస్‌యుటీఎఫ్, టీపీటీఎఫ్ అభ్యర్థి అశోక్ కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని టీఎస్‌యుటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏ.వెంకట్ కోరారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారమే ఎజెండాగా భావిస్తూ ఎన్నికల్లో పోటీ చేస్తున్నామని తెలిపారు. ధన రాజకీయాలను ఓడిస్తూ అశోక్ కుమార్‌ను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు దాసరి శంకర్, ప్రధాన కార్యదర్శి పెంటా అశోక్, జిల్లా ఆడిట్ కన్వీనర్ ముడారపు పరమేశ్వర్, జిల్లా ఎఫ్‌డబ్ల్యూఎఫ్ కన్వీనర్ చల్లా గోవర్ధన్‌రావు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

నవతెలంగాణ-నిర్మల్‌టౌన్
స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని డీసీసీ అధ్యక్షులు కూచాడి శ్రీహరిరావు దిశా నిర్దేశం చేశారు. గురువారం నిర్మల్‌లోని తన క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలోని అన్ని మండలాల కాంగ్రెస్ అధ్యక్షులు, మార్కెట్ కమిటీ చైర్మెన్‌లు, డైరెక్టర్లు, మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. రాబోవు స్థానిక సంస్థల ఎన్నికలలో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలుపరుస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి కార్యకర్త గ్రామాలలో ఇంటింటికి ప్రచారం చేసి, మన ప్రతిపక్ష పార్టీలైన బీజేపీ, బీఆర్ఎస్ లకు దీటుగా సమాధానం చెప్పాలని పిలుపునిచ్చారు.

దర్గాకు రూ.51 వేల విరాళం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్
పట్టణంలోని చాందా(టి)లోని హస్రత్ సయ్యద్ సిరాజ్ ఉద్దీన్ రాజషావలీ దర్గాకు ఆదిలాబాద్ కాంగ్రెస్ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాసరెడ్డి రూ.51వేల విరాళాన్ని అందజేశారు. దర్గాలో జరుగుతున్న ఉర్సు ఉత్సవాల నిర్వహణకు సంబంధించి ఆయన తరపున మైనారిటీ నాయకులు ప్రజాసేవా భవన్‌లో దర్గా నిర్వాహకులకు అందజేశారు. కార్యక్రమంలో దర్గా కమిటీ సభ్యులు జాకీర్ మౌలానా, రషీద్ అలీ ఖాన్, ఫైజుల్లా, కాంగ్రెస్ సీనియర్ నాయకులు గిమ్మ సంతోష్‌రావు, మాజీ మున్సిపల్ వైస్ చైర్మెన్ జహీర్ రంజాని, ముజాహిద్, మొహమ్మద్ రఫీక్, లోక ప్రవీణ్ రెడ్డి, ఎం.ఎ షకీల్, కిజర్ పాషా, షేక్ ఇమ్రాన్, ఎంఏ కయ్యూమ్, షేక్ ఖలీం, సయ్యద్ షాహిద్ అలీ, నూర్ ఖాన్, డేరా కృష్ణారెడ్డి, అస్బాత్ ఖాన్, అల్లాబకష్ పాల్గొన్నారు.

ఘనంగా ఎమ్మెల్యే కోవ లక్ష్మీ జన్మదిన వేడుకలు

నవతెలంగాణ-నార్నూర్
ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మీ జన్మదిన వేడుకలను గురువారం మండల కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గాంధీచౌక్ వద్ద మాజీ సర్పంచుల సంఘం మండలాధ్యక్షుడు ఉర్వేత రూప్‌దేవ్ నాయకులు శుభాకాంక్షలు తెలిపి కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో ప్యాక్స్ ఇన్‌ఛార్జి చైర్మన్ ఆడే సురేష్, బీఆర్ఎస్ నాయకులు ఖాసిం, మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తొడసం నాగోరావ్, జాదవ్ సూరజ్, ఫెరోజ్ ఖాన్, రూప్ దేవ్, కనక ప్రభాకర్, రాథోడ్ సుభాష్, మెస్రం మానిక్‌రావ్, కుంర రాహుల్, రాథోడ్ శివాజీ, కార్యకర్త పాల్గొన్నారు.

నాగోబా హుండి ఆలయం ఆదాయం రూ.21 లక్షలు

నవతెలంగాణ-ఇంద్రవెల్లి
రాష్ట్రంలోనే ప్రసిద్ధి గాంచిన కేస్లాపూర్‌లోని నాగోబా జాతర గత నెల 28 నుంచి ఈనెల 4వ తేది వరకు అధికారికంగా నిర్వహించారు. ఈ జాతరకు భక్తులు హుండీలో సమర్పించిన కట్నం, కానుకలను గురువారం దేవాదాయశాఖ, మెస్రం వంశీయుల ఆధ్వర్యంలో లెక్కించారు. ఈ సందర్భంగా భక్తులు సమర్పించిన హుండి ఆదాయం రూ.9లక్షల 71వేల 677 కాగా, లైజాలర్ వేలం రూ.11లక్షల 36వేల 834 వచ్చిందన్నారు. మొత్తం ఆదాయం రూ.21లక్షల 8వేల 511 ఆదాయం వచ్చినట్టు దేవాదాయ శాఖ అధికారి రాజమౌళి తెలిపారు.